ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 18 మే 2025 | 5

కాకినాడ
ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38(శనివారం)
కనిష్ఠం : 27

వివాహేతర సంబంధం నేపథ్యంలో
ఇద్దరి ఆత్మహత్య 7

కాకినాడలో తిరంగా యాత్ర



కాకినాడ జేఎన్‌టీయూకే నుంచి సర్పవరం వరకు తిరంగా ర్యాలీ చేపడుతున్న కూటమి నేతలు..(ఇన్‌సెట్‌లో) రిటైర్డ్ ఆర్మీ అధికారులకు సన్మానం చేస్తున్న దృశ్యం

నిర్లక్ష్యం.. ప్రదర్శనశాలలు

- గత వైభవానికి చిహ్నాలు 6
- నేడు ఎవరికీ పట్టని కట్టడాలు
- కనుమరుగైపోతున్న చారిత్రక అపురూపాలు
- నేడు అంతర్జాతీయ మ్యూజియం డే

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర


కాకినాడలో మొక్క నాటుతున్న ఎస్పీ బిందుమాధవ్


సామర్లకోటలో భీమేశ్వరాలయం ఆవరణలో చీపుర్లతో రోడ్డు శుభ్రపరుస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

స్వచ్ఛతా దివాస్‌లో భాగంగా శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈనెలలో మూడో శనివారం బీట్‌దిహీట్ కార్యక్రమం నిర్వహిస్తుండగా పలుచోట్ల ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు తదితరులు మొక్కలకు నీరు పోయడం, మజ్జిగ పంపిణీ, చలివేంద్రాల ప్రారంభం, చీపుర్లతో రోడ్లు శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛతతోనే ఆరోగ్యంగా ఉంటామని అవగాహన కల్పించారు. 8



3 పథకాల అమలుకు గ్రీన్‌సిగ్నల్

పథకం	అర్హులు	నగదు (కోట్లు)
తల్లికి వందనం	16.51 లక్షలు	2,476
ఉచిత బస్	25.52 లక్షలు	--
గ్యాస్ సిలిండర్	13 లక్షలు	--

- మహిళలకు తీన్‌మార్
- ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు
- 25.50 లక్షల మందికి ప్రయోజనం
- బడులు తెరిచేలోగా తల్లికి వందనం
- ఇప్పటికే విద్యార్థుల జాబితా సిద్ధం
- 16.51 లక్షల తల్లులకు డబ్బులు
- మూడు సిలిండర్లకు ఒకేసారి నగదు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టత ఇచ్చింది..అతివలంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ఉచిత బస్సు ప్రయాణానికి ముహూర్తం ఖరారు చేసింది. ఆగస్టు 15 నుంచి పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు శనివారం కర్నూలులో అధికారికంగా ప్రకటించారు. పాఠశాలలు తెరిచేసరికి తల్లికి వందనం పథకం కింద మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.ఇంట్లో ఎందరు పిల్లలు ఉంటే వారం దరికి ప్రభుత్వం నగదు జమ చేయ నుంది. మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీకి సంబం ధించి ప్రస్తుతం ఒక్కో సిలిండర్‌కే నగదు జమ చేస్తుండగా.. ఇకపై ఒకేసారి మూడు సిలిండర్ల నగదు ఒకేసారి మహిళల ఖాతాల్లో జమచేయబో తున్నట్టు ఇటీవల చంద్రబాబు ప్రకటించారు. ఇలా ఎన్నికల ముందు టీడీపీ ప్రకటించిన మూడు సూపర్ సిక్స్ హామీల అమలుకు చకచకా అడుగులు వేస్తుండడంతో మహిళలకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరబోతోంది.



ఆగస్టు 15 నుంచి ఉచిత బస్..

సూపర్‌సిక్స్ హామీల అమలుకు సీఎం చంద్రబాబు చకచకా అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా మహిళలకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే పథకాలను నెరవేర్చడానికి కసరత్తు తీవ్రం చేశారు.తాజాగా శనివారం కర్నూలు పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 25.52 లక్షల మందికిపైగా మహిళలకు లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగానా.. లేదా విభజిత జిల్లాల ప్రాతిపదికన ఉచిత బస్సు పథకం అమలు చేస్తారా అనే దానిపై త్వరలో స్పష్టత రానుంది. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఆర్టీసీ చార్జీలను పెంచేసి పేదల నడ్డివిరగ్గొట్టింది. కొద్దిపాటి దూరానికే షాక్‌కొట్టే చార్జీలు వసూలు చేసింది. దీంతో టీడీపీ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించింది. కూటమిని గెలిపిస్తే ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చింది.పథకం అమలు ప్రకటించడంతో మహిళల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గ్యాస్ డబ్బులూ ఒకేసారి..

మహిళలకు ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తామన్న హామీ మేరకు ఇప్పటికే ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారు.మహిళలు సిలిండర్ బుక్ చేసుకున్న తర్వాత కొద్దిరోజులకే ఆ డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 13 లక్షల వరకు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.తొలి ఉచిత సిలిండర్ కింద ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 11.52 లక్షల మంది ఈ సదుపాయం వినియోగించుకోగా రూ.95 కోట్లు బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. రెండో ఉచిత సిలిండర్ ఇప్పటికే 6.70 లక్షల మంది తీసుకున్నారు.డబ్బులు ఖాతాల్లో జమవుతున్నాయి.ఇకపై విడివిడిగా కాకుండా మూడు సిలిండర్లు బుక్ చేసుకున్నా చేసుకోకపోయినా ముందే నగదు ప్రభుత్వం ఖాతాల్లో జమచేయబోతోంది.



తల్లికి..రాబడి..

తల్లికి వందనం పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వచ్చే నెలలో స్కూళ్లు తెరిచేలోగా తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని తాజాగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో లక్షల మంది పేద, మధ్య తరగతి తల్లుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తల్లికి వందనం కింద ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు పిల్లలను బడులకు పంపే తల్లులకు ఏటా రూ.15 వేల చొప్పున ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని బడులు తెరిచేలోపు అమలు చేస్తామని ప్రకటించారు. వాస్తవానికి గత ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేలు ఇస్తామని ప్రకటించి మోసగించింది. సీఎం చంద్రబాబు ఇటీవల బడ్జెట్‌లో పథకానికి ప్రాధాన్యత కల్పించారు. వచ్చే నెలలోగా జమ కానున్న తల్లికి వందనం డబ్బులు ఉమ్మడి తూర్పుగోదావరిలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 16.51 లక్షల మంది పిల్లలకు సంబంధించి వారి తల్లులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15 వేల చొప్పున ఉమ్మడి జిల్లాకే ఏకంగా రూ.2,476 కోట్ల వరకు నిధుల అవసరం. కాకినాడ జిల్లా చూసుకుంటే 6.20 లక్షల మంది పిల్లల తల్లులకు ప్రయోజనం కలగనుంది.

రహదారుణాలు!



వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురి మృతి

తునిలో ముగ్గురిని బలి తీసుకున్న ప్రమాదం

7 మెయిన్ పేజీల్లో

అతివేగం ప్రాణాలు తీస్తోంది.. ఎదురొచ్చే ప్రమాదాన్ని అంచనా వేయలేక పలువురు ప్రాణాలనే పోగొట్టుకుంటున్నారు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం రహదారులు రక్తసిక్తమయ్యాయి.. వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మృతిచెందారు. కాకినాడ జిల్లా తుని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఐరన్ లోడ్ లారీని విశాఖ నుంచి వేగంగా వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.. తెలంగాణ రాష్ట్ర రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో కుటుంబం దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కోనసీమ జిల్లా అంబాజీ మండలం ముక్కామల వద్ద జరిగిన ప్రమాదంలో వివాహిత మృతి చెందగా నలుగురు గాయాలపాలయ్యారు. కాలినడకన శృంగార వల్లభస్వామి ఆలయానికి వెళుతున్న మహిళను పిఠాపురంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ముమ్మిడివరం వద్ద మోటార్‌సైకిల్‌ను లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు.. ఎండగా ఉందని లారీ కింద సేదతీరుతుంటే డ్రైవర్ గమనించకుండా పోనివ్వడంతో మరొకరు మృతిచెందారు.


మాజీ మంత్రి రాజా


విలేకరి కాతా

దాడి పాపం.. పండినట్టే!

అన్ని రోజులూ ఒకేలా ఉండవు.. కాలం ప్రతి ఒక్కరి లెక్క సరిచేస్తుంది.. ఇది అక్షర సత్యం.. ఒకనాడు ఆయన మంత్రి.. ఏం చేసినా అడిగే నాథుడు లేడు.. చివరికి ఆంధ్రజ్యోతి విలేకరిని అతనే చంపించాడని ఆరోపణలున్నా కేసే లేదు.. దర్జాగా తిరుగుతున్నాడు.. కాలం మారింది.. కాలంతోపాటే ప్రభుత్వమూ మారింది.. ముగిసిపోయిందనుకున్న కేసును తిరిగి తెరిచారు.. పాపం లెక్క సరిచేయడానికి చూస్తున్నారు.. అతనెవరో తెలుసా..మాజీ మంత్రి దాడిశెట్టి రాజా.. ఇన్నాళ్లకు అతని పాపం పండిందని అనుకుంటున్నారు. - 7లో

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం: కలెక్టర్ షాన్‌మోహన్


మొక్క నాటుతున్న ఎంపీ ఉదయ్, కలెక్టర్ షాన్‌మోహన్

తునిరూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. తుని ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. వైద్యఆరోగ్యశాఖ నోడల్ అధికారి అజయ్ జైన్, తుని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరితో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, మెప్మా సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. తునిఏరియా ఆస్పత్రిలో ఆరోగ్య సేవలపై ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ఆరా తీశారు. సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కాగా, తుని ప్రభుత్వాస్పత్రిలో సమస్యలపై కలెక్టర్‌కు జనసేన నేతలు వినతిపత్రం అందించారు.


కలెక్టరేట్‌లో మొక్కకు నీరు పోస్తున్న డీఆర్‌వో వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), మే 17(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో వెంకట్రావు మొక్కలకు నీరుపోశారు. కలెక్టరేట్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.

22న జిల్లా మినీ మహానాడు

- ఏర్పాట్లపై యనమల నివాసంలో ప్రత్యేక సమావేశం

కాకినాడ సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 22న జిల్లా మినీ మహానాడు-2025కు సంబంధించిన ఏర్పాట్లపై శనివారం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు నివాసంలో ప్రత్యేకసమావేశం నిర్వహించారు. టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, టీడీపీ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, పార్టీరాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, బోళ్ల కృష్ణ మోహన్ పాల్గొన్నారు. మినీ మహానాడు కార్యాచరణ, నిర్వహణ విధివిధానాలపై సమగ్రంగా చర్చించారు. ఈనెల 22న ఉదయం 9.30గంటలకు కాకినాడలోని వివేకానందపార్కుగోదావరి కళాక్షేత్రంలో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని పెంచుతూ, ప్రజల్లో మరింత విశ్వాసాన్ని బలపరుస్తూ కార్యక్రమాన్ని పెద్దస్థాయిలో విజయవంతం చేయాలని నేతలు పేర్కొన్నారు.


యనమల నివాసంలో సమావేశమైన నేతలు



నిర్లక్ష్యం

» గత వైభవానికి చిహ్నాలు » నేడు ఎవరికీ పట్టని కట్టడాలు
» పాలకుల అశ్రద్ధ » కనుమరుగైపోతున్న చారిత్రక అపురూపాలు

ప్రదర్శనశాలలు!

నేడు అంతర్జాతీయ మ్యూజియం డే

రాజమహేంద్రవరం అంటే గోదావరి గట్టు, పార్కులు మాత్రమే కాదు.. అలనాటి వైభవాన్ని కళ్ల ముందుంచే మ్యూజియాలు కూడా ఉన్నాయి. సంస్కృతిని.. గత వైభవాన్ని భావి తరాలకు అందించే ఆలయాలు ఈ ప్రదర్శనశాలలు (మ్యూజియాలు). రాజమహేంద్రవరం వెయ్యేళ్ల చరిత్రకు మౌనసాక్షి. ఈ కాలగమనంలో ఎందరో మహానుభావులు ఇక్కడ కదలాడారు. ఎన్నో సజీవ అవశేషాలను ఆనాటి చరిత్రకు రుజువులుగా చరిత్ర మిగిల్చింది. వాటిని చూడడం వల్ల గత కీర్తిని పరికించవచ్చు. అవశేషాలను తాకడంతోనే చరిత్రను స్పృశించినట్టు ఉంటుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న ప్రదర్శనశాలలు అధ్వానంగా మారిపోవడం చూస్తే 'అంతర్జాతీయ మ్యూజియం డే' సాక్షిగా ఆవేదన కలిగిస్తోంది. కనీసం కరెంటు బిల్లుకూ తిఖానా లేని దుస్థితిని చూసి చరిత్ర కన్నీరు పెడుతోంది. ఆనాటి మహానుభావులు మనకు అందించిన వారసత్వ సంపదను ఇప్పుడు మనం కాపాడుకోలేకపోతున్నాం. రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇక్కడి వారే. ఇప్పుడైనా మ్యూజియాల దుస్థితి దూరమవుతుందేమో కాలమే చెప్పాలి. నేడు అంతర్జాతీయ మ్యూజియం డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

రాజమహేంద్రవరం ఘనతనే కాకుండా ఆంధ్రదేశ కీర్తిని కళ్ల ముందు కదలాడించే సజీవ అవశేషాలు, చిత్రలేఖనాలు వంటి వాటితో ప్రదర్శనశాలలు ఇక్కడ ఉన్నాయి. తాళపత్రాలు, తామ్రశాసనాలతోసహా ఎంతో అపురూప పురావస్తు సంపద ఉన్న రాళ్లబండి సుబ్బారావు ప్రదర్శనశాల, యుగ పురుషుడు కందుకూరి వీరేశలింగం జన్మ గృహం, దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ, మరుగున పడిపోతున్న ఎన్నో సాహిత్య ప్రక్రియలను భావితరాలకు అందించాలని తపించిన జానపద వాఙ్మయ బ్రహ్మ నేదునూరి గంగాధరం జానపద స్మారక గ్రంథాలయం, ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణాన్ని కళ్లకట్టే కాటన్ మ్యూజియం.. అన్నీ దీనావస్థలోనే ఉన్నాయి. సాధ్యమైనంత వరకూ డిజిటలైజేషన్ చేయాలనే ఆలోచన చేయకపోవడంతో ఎన్నో అపురూపాలు భావితరాలకు అందకుండాపోయే ప్రమాదం కనబడుతోంది. **- రాజమహేంద్రవరం/ఆంధ్రజ్యోతి**






రాజమహేంద్రవరంలోని దామెర్ల ఆర్ట్ గ్యాలరీ.. దామెర్ల, దామెర్ల చిత్రాలు

దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ



గోకవరం బస్టాండు ఎదుటి వీధిలో రెండు పెద్ద భవనాల్లో దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ ఉంది. ఇది సాంకేతిక విద్యా శాఖ ఆధీనంలో నడుస్తోంది. ఐదేళ్ల నుంచీ కరెంటు బిల్లు కూడా చెల్లించలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. రామారావు స్వయంగా వేసిన చిత్రాలతోపాటు ఎన్నో అపురూపమైన చిత్రాలు చరిత్రలో కలిసిపోడానికి సిద్ధంగా ఉన్నాయి. దామెర్ల రామారావు 1897 మార్చి 8న రాజమహేంద్రవరంలో జన్మించారు. చదువుకంటే చిత్రలేఖనంపైనే ఎక్కువగా ఆసక్తి ఉండడం గమనించిన ఆయన మేనమామ రామారావుకు పదేళ్ల ప్రాయంలోనే వాటర్ కలర్స్‌ని కొనిచ్చారు. రామారావు తన సొంత భావాలను కుంచె నుంచి జాలువార్చి అపురూప కళాఖండాలను చిత్రించారు. ఆయనకు 15 ఏళ్లప్పుడు కళాశాల ప్రిన్సిపాల్ ఓజే కూల్డ్రే ప్రతిభను గుర్తించి సహకరించగా తండ్రి వెంకట రమణారావు కొడుకును 1916లో ముంబైలోని జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ కళాశాలకు పంపించారు. ఆయన వేసిన చిత్రాలు 1922లో విదేశాల్లో ప్రదర్శించారు. అక్కడికి తీసుకెళ్లిన చాలా కళాఖండాలు తిరిగి రాలేదని చెబుతారు. రామారావు చిత్రకళతో ఎంతో ఖ్యాతిని సముపార్జించడంతోపాటు రాజమహేంద్రవరానికి కూడా చిత్రలేఖనంలో ఘనత సాధించిపెట్టారు. ఆయను సముచిత గౌరవం ఇస్తూ దామెర్ల రామారావు ఆర్ట్స్ గ్యాలరీని 1954 జూన్ 23న అప్పటి కేంద్ర సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రారంభించారు. అనంతరం మరో భవనానికి 1996 మార్చి 17న అప్పటి రాజమండ్రి ఎంపీ కేవీఆర్ చౌదరి శంకుస్థాపన చేశారు.

నేదునూరి జానపద స్మారక గ్రంథాలయం



నేదునూరి దంపతులు







రాజమహేంద్రవరంలోని నేదునూరి గంగాధరం జానపద వాఙ్మయ గ్రంథాలయం.. గ్రంథాలయంలో జానపద సాహిత్య పుస్తకాలు

జనపదాలే జానపదాలు. వాటిని పోగు చేయడమంటే మాటలు కాదు. ఎంతో వ్యయప్రయాసలు తప్పవు. అంతటి కష్టాలకోర్చి సేకరించిన జానపద సాహిత్యంతో దేశంలో రెండు గ్రంథాలయాలు మాత్రమే ఉన్నాయి. ఒకటి పంజాబులో దేవేంద్ర ప్రత్యర్థిది కాగా.. రెండోది మన నేదునూరి జానపద స్మారక గ్రంథాలయం. దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ పక్కనే ఉంది. జన పదాలకు సంబంధించిన ఎన్నో సాహిత్య ప్రక్రియలను ఇక్కడ మనం చూడవచ్చు. చెక్క భజనలు, జానపద కథలు, గేయాలు, చాటువులు, బూతుల బుంగ, బాల సారస్వతం వంటి ఎంతో సాహిత్య సంపద ఇక్కడ ఉన్నా, అచ్చుకు మాత్రం నోచుకోవడం లేదు. నేదునూరి గంగాధరం 22ఏళ్ల దీక్షగా జానపద వాఙ్మయ సేకరణ చేశారు. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే తీరిక సమయాల్లో, సెలవు రోజుల్లో సొంత ఖర్చులతో గ్రామాలకు వెళ్లి పొలంలో, గ్రామ బడిలో, గుడిలో బస చేస్తూ ఒక్కోసారి భోజనం కూడా లేకుండా కాళ్లకు బలపం కట్టుకొని తిరిగేవారు. మరుగున పడిపోయిన ఎన్నో సాహిత్య ప్రక్రియలకు ప్రాణం పోశారు. పల్లె మాటలు, అంతరించిపోతున్న కమ్మని తెలుగు పదాల సంద్రాన్ని భావితరాలకు అందించాలనే తలంపుతో దేశం నలుమూలలా తిరిగి సాహిత్య సేకరణ చేశారు. 'తెలుగు పలుకుబడి తరబడి నుడిగారము నిగారముల నిండుకుండ ఈ వాఙ్మయమని గంగాధరం అనేవారు. ఆయన వాఙ్మయ సేకరణ తపస్సులో జేబు నిండుకుంటే నేనున్నానంటూ తన 50 కాసుల బంగారాన్ని, విలువైన చీరలను కూడా తృణప్రాయంగా ఇచ్చేసింది ఆయన సహధర్మ చారిణి గంగమాంబ. ప్రస్తుతం గంగాధరం కుమార్తె, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు యుందాని సూర్య ప్రభావతి ఈ గ్రంథాలయం బాగోగులు చూస్తున్నారు. చాలా ఏళ్ల కిందట ఓ లక్ష రూపాయలు తప్ప ఈనాటికీ అటు ప్రభుత్వం గానీ, ఇటు సాహిత్యాభిలాషులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో వెల కట్టలేని పద సంపద కాలగర్భంలోకి వెళ్లిపోయే స్థితికి చేరుతోంది.



నిర్మాణంలో ఉన్న మ్యూజియం కొత్త భవనం

రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం

చరిత్ర విజ్ఞానాభివృద్ధే ధ్యేయంగా 1922 సెప్టెంబరులో ఆంధ్రేతిహాస పరిశోధక మండలిని రాజమహేంద్రవరంలో స్థాపించారు. 1926లో చరిత్ర పరిశోధకులు రాళ్లబండి సుబ్బారావు గౌరవ అధ్యక్షుడిగా సంస్థను రిజిస్టర్ చేయించారు. అప్పట్లోనే విజయనగరం రాజు విజయరామగజపతిరాజు భవన నిర్మాణానికి రూ.13 వేలు విరాళంగా ఇచ్చారు. 1967 మార్చి 1న ఆ సంస్థ పురావస్తుశాఖ ఆధీనంలోకి వెళ్లగా.. 'రాళ్లబండి సుబ్బారావు ప్రభుత్వ ప్రదర్శనశాల'గా నామకరణం చేశారు. ఇక్కడ ఎంతో అపురూపమైన చారిత్రక విశేషాలను పదిలపరిచారు. తామ్రశాసనాలు, తాళపత్ర గ్రంథాలు, చరిత్ర పుస్తకాలు ఎన్నో ఇక్కడ ఉన్నాయి. జానపద సంపద ఎంతో ఇక్కడ భద్రపరచబడి ఉంది. ప్రస్తుతం నూతన భవనాన్ని నిర్మిస్తున్నందున వాటిని బొమ్మూరులోని కాటన్ నివాస గృహంలో భద్రపరిచారు. కొత్త భవన నిర్మాణం నత్తనడకతో పోటీపడుతోంది.



వీరేశలింగం జన్మ గృహం

వీరేశలింగమొకడు మిగిలెను చాలు.. అన్నాడో కవి. అంతటి మహానుభావుడు తిరుగాడిన నేల ఇది. ఆయన స్వగృహం గోదావరి గట్టు సమీపంలో ఉంది. అక్కడే ఆయన సహధర్మచారిణి రాజ్య లక్ష్మమ్మ నివాసాన్ని కూడా చూడవచ్చు. వీరేశలింగం వస్త్రాలు, ఆయన కూర్చున కుర్చీ, అప్పట్లో ఆయన నడిపిన పత్రిక అచ్చు యంత్రంతోపాటు తొలి వితంతు వివాహ ఘట్టపు నమూనా ఇక్కడ ఉంది. వీరేశలింగానికి తన ఆదాయ వ్యయాలను రాసుకునే అలవాటు ఉంది. వాటితోపాటు కొందరు ఆయనకు రాసిన లేఖల ప్రతులు కూడా ఇక్కడ ఉన్నాయి. ఇవే కాకుండా సుమారు 10వేల పుస్తకాలను కూడా ఇక్కడ భద్రపరిచారు. కానీ ఈ గృహం ప్రస్తుతానికి శిథిలావస్థకు చేరుకొంది. దీంతో విద్యార్థులను అనుమతించడం లేదు. కొన్ని స్తంభాలు స్థానభ్రంశమై ముట్టుకుంటే పడిపోయే స్థితికొచ్చాయి. వీరేశలింగం దంపతుల సమాధులు ఉమెన్స్ కాలేజీ సమీపంలో 'ఆనంద నిలయం'లో ఉన్నాయి.









కాటన్ మ్యూజియం

సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు ఎలంటి రవాణా సదుపాయాలు లేని రోజుల్లో, అడవుల్లో తిరుగుతూ.. ఎంతో ప్రయాసతో ధవళేశ్వరం ఆనకట్ట కట్టి వృథాగా పోతున్న గోదావరి నీటిని ఒడిసిపట్టి లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేశారు. ఆనకట్ట నిర్మాణంలోని ఇంజనీరింగ్ నైపుణ్యం, వినియోగించిన యంత్రాలు, ఆనకట్ట నమూనా వంటి వాటితో కాటన్ మ్యూజియాన్ని 1988 ఫిబ్రవరి 25న అప్పటి సీఎం ఎన్టీ రామారావు ప్రారంభించారు. ఇక్కడికి వెళ్లి నమూనాలను, చిత్రాలను, యంత్రాలను చూస్తే ఆనకట్ట నిర్మాణం కళ్లకు కట్టినట్లుగా ఉంటుంది. కానీ నేడు ఈ మ్యూజియం నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. కనీసం గార్డెన్‌ని కూడా నిర్వహించలేని దుస్థితిలో ఉంది. గత పుష్కరాలకు నిధులు ఇవ్వడంతో కొంత మెరుగులు దిద్దారు. మళ్లీ పుష్కరాలు రానే వస్తున్నాయి. ఈ పదేళ్లలో సరైన నిర్వహణ లేకపోవడంతో కాటన్ మ్యూజియం కళ తప్పుతోంది.



కాకినాడ మ్యూజియం.. భద్రపరచిన విగ్రహాలు, తాళపత్రాలు





అద్భుత భాండాగారం.. కాకినాడ మ్యూజియం

చరిత్ర మానవజాతికి జీవగర్ర. అలాంటి చరిత్ర మనం తెలుసుకుని ముందుకు వెళితే భవిష్యత్తుకు అద్భుతమైన బాటలు వేస్తాయని చరిత్రకారులు చెప్పారు. అలాంటి చరిత్ర తెలుసుకోవాలంటే పురావస్తు పరిశోధనా సంస్థలు ప్రదర్శనశాలలు నేటి తరానికి అవసరం. వేల సంవత్సరాల కిందట నాటి తాళపత్ర గ్రంథాలతోపాటు వందల ఏళ్ల నాటి పురావస్తు ప్రదర్శనతో కాకినాడ మ్యూజియం ఒక అద్భుతంగా మనకు కనిపిస్తుంది. వివేకానంద పార్కు సమీపంలో కలిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రభుత్వ పురావస్తు ప్రదర్శనశాల, పరిశోధన సంస్థ. పరిశోధకులకు, సాహితప్రియులకు ఒక అపురూపం. ఇక్కడ కొన్నేళ్లకాలం నాటి శాసనాలు విగ్రహాలు, గ్రంథాలు మనకు అందుబాటులో ఉన్నాయి. పాండురంగని అద్దంకి శాసనం, యుద్ధమల్లుని బెజవాడ శాసనంతో సహా 88 శాసనాలు ఉభయగోదావరి జిల్లాల్లో జరిగిన తవ్వకాల్లో బయటపడిన పురాతన హైందవ బౌద్ధ జైన విగ్రహాల చారిత్రక వస్తువులు, కళాఖండాలు మనకు ఈ మ్యూజియంలో ఉన్నాయి. దాదాపు 5వేలకు పైబడిన తాళపత్ర గ్రంథాలు, సుమారు 500 వ్రాతప్రతులు, 1880 నుంచి ముద్రితమైన ఆంధ్ర కన్నడ, ఆంగ్ల సంస్కృత గ్రంథాలు పదివేలకు పైగా ఇక్కడ ఉన్నాయి. సాహిత్య చరిత్ర పత్రికలు ఆంధ్ర హిస్టారికల్ జర్నల్ భారతి, ఆంధ్ర సాహిత్య పరిషత్తు పత్రికలు కూడా ఈ పాత ప్రతుల్లో మనకు ఉన్నాయి. సిరాలేని సమయంలో కరక్కాయ రసంతో పాళీతో స్వయంగా శ్రీనాథుడు లిఖించిన శివరాత్రి మహత్యం కావ్యం కూడా ఇక్కడ మ్యూజియంలో ఉంది. శ్రీకృష్ణదేవరాయ కాలమనేటి తామర శాసనాలు, మొదటి ప్రపంచ యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాలు, పాత శిలాయుగపు పనిముట్లు భద్రపరిచారు. పాత భవనం స్థానే కొత్త భవనం నిర్మించగా.. త్వరలోనే మ్యూజియం కొత్త భవనంలోకి మారనుంది.

- కార్పొరేషన్(కాకినాడ)/ఆంధ్రజ్యోతి

రేపటి నుంచి ఏపీఈఏపీ సెట్ ప్రవేశ పరీక్షలు

» మొత్తం 3,62,448 దరఖాస్తులు
» 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ
» 21 నుంచి 27 వరకూ పరీక్షలు
» ఏపీఈఏపీసెట్ కన్వీనర్ సుబ్బారావు



ఏపీఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, మే 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్-2025కు 3,62,448 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకున్నారని సెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,80,612మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 81,836 రెండింటికీ 912 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. పరీక్షలు ఏపీలో 143, తెలంగాణాలోని హైదరాబాద్‌లో 2కేంద్రాలు మొత్తం 145 పరీక్షా కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో జరుగుతాయన్నారు. రూ.10,000 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునేందుకు సంబంధించిన గడువు శుక్రవారంతో ముగిసింది. పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకూ రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. అంగవైకల్యం కలిగిన ఆరుగురు విద్యార్థులకు సహాయకులను కేటాయించామని ఆన్‌లైన్ దరఖాస్తులో సమాచారాన్ని తప్పుగా పూరిస్తే ఆందోళన చెందవద్దని పరీక్ష పూర్తయిన తరువాత సహాయకేంద్రంలో సంప్రదిస్తే తప్పులను సవరిస్తామని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటూ ఏదైనా ఒరిజినల్ గుర్తింపుకార్డును తీసుకువెళ్లాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి గంటన్నర ముందుగా ప్రవేశం కల్పిస్తారన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని, రఫ్‌పేపర్లు తమవెంట తీసుకురాకూడదని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న పరీక్షాకేంద్రాన్ని కేటాయించామని, విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ఏపీఈఏపీసెట్‌కు సంబంధించిన https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 9552300009 ఫోన్ నెంబరు ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. 19,20 తేదీల్లో అగ్రికల్చర్ ఫార్మసీ, 21నుంచి 27వరకూ ఇంజనీరింగ్ విభా గం పరీక్షలు 14 సెషన్లలో జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఒక్కనిమిషం ఆల స్యంగా హాజరైనా అనుమతించరని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884 2359599, 2342499 నెంబర్లలోకానీ, helpdeskapeapcet @ap sche.org మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సూచించారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తరువాత వారికి కేటాయించిన పరీక్షా కేంద్రం రూట్‌మ్యాప్‌ను తెలుసుకునేందుకు హాల్‌టికెట్ చివరిపేజీలో గూగుల్‌మ్యాప్ ఇస్తామన్నారు. విద్యార్థికి కేటాయించిన పరీక్షా కేంద్రం పూర్తి చిరునామానుhttps://cets. apsche.ap.gov.in/eapcet/EAPCET_Centers.aspxద్వారా తెలుసుకోవడంతోపాటూ గూగుల్ మ్యాప్‌ను పొందవచ్చని సూచించారు.

● కాకినాడ జిల్లాలో ఈ పరీక్షలకు కాకినాడ జిల్లాలో 12,637మంది విద్యార్థులు హాజరుకానున్నారనివారిలో 8,957మంది ఇంజనీరింగ్, 3,680 మంది అగ్రికల్చర్‌ఫార్మసీ పరీక్షలు ఆన్‌లైన్‌లో రాయనున్నారన్నారు. జిల్లాలో ప్రగతి ఇంజనీరింగ్, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఆదిత్య యూనివర్శిటీ, కాకినాడ రాయుడుపాలెంలోని సాఫ్ట్ టెక్నాలజీ కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు.


● తూర్పుగోదావరిజిల్లాలోని రాజమహేంద్రవరం ప్రాంతీయకేంద్రం పరిధిలో 10,228మంది విద్యార్థులు హాజరుకానున్నారని వారిలో 7,643 మంది ఇంజనీరింగ్, 2585 మంది అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షలు రాయనున్నారుని లూథర్‌గిరిలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్, గైట్ కళాశాల కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు.

● డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమజిల్లా అమలాపురం ప్రాంతీయకేంద్రం పరిధిలో శ్రీనివాసా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బీవీసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కేంద్రాల్లో నిర్వహించే ఈఏపీసెట్‌పరీక్షలకు 5,631మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈరెండు కేం ద్రాల్లో ఇంజనీరింగ్ పరీక్షకు 4,030మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 1601మందివిద్యార్థులు పరీక్షలు రాయనున్నారని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు.

ముగిసిన శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), మే17(ఆంధ్రజ్యోతి): సిమెన్స్ టాటా స్ట్రీవ్‌లో భాగంగాఈనెల 13నుంచి కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థలో రాజమండ్రి, ఏలూరు, భీమవరం, గుడివాడ, ప్రభుత్వ ఐటీఐలో పనిచేస్తున్న సిబ్బందికి నిర్వహించిన నూతన బోధనశాస్త్ర శిక్షణ శనివారంతో ముగిసింది. కన్వీనర్ ఎం.వేణుగోపా ల్‌వర్మ మాట్లాడుతూ ఉత్తమశిక్షణ ఇచ్చేందుకు ఐటీఐల అభివృద్ధికి, పరిశ్రమలకు స్కిల్ టెక్నీషియన్స్‌ను అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్ అక్షయ్‌అజత్కర్, ఎస్‌పీసీ మార్కండేయులు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సంతోష్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎంఎంఎస్ మూర్తి, టీవో పాల్గొన్నారు.

సంచలనాల చలం



ఆంధ్రజ్యోతి-కార్పొరేషన్(కాకినాడ):

మైదానం.. ఈ పుస్తకం ఒక సంచలనం. స్త్రీ స్వేచ్ఛను స్త్రీ హక్కులను పురుష దురహంకారం మీద ప్రశ్నించిన పాశుపతాస్త్రం. ఈ పుస్తకం అప్పట్లో ఒక సంచలనం. 20వ శతాబ్దం తొలి నాళ్లలోనే స్త్రీవాదాన్ని, మహిళల హక్కులను ప్రశ్నిస్తూ సమాజాన్ని పరుగులు పెట్టించిన రచయిత సామాజిక ఉద్యమకారుడు, స్త్రీవాది గుడిపాటి వెంకటాచలం. చలంగా సుప్రసిద్ధమైన ఆయన రచనలు ఒక సంచలనం. 19వదశకాల్లో ఆయన రాసిన ప్రతి అక్షరం ఒక ప్రశ్న, సమాజాన్ని పట్టిపీడిస్తున్న భావజాలానికి ఒక హెచ్చరిక. నేడు చలం జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

» స్త్రీ వాదం ఆయన అభిమతం
» సమానత్వం ఆయన సాహిత్యం
» నేడు చలం జయంతి

కాకినాడతో అనుబంధం..

చలం రచించిన మైదానంతోపాటు స్త్రీ, రుక్మిణి, చలం, అరుణోదయం జీవితం చింతామణి వంటి రచనలు సమాజానికి మేలుకొలుపునిచ్చారు. ఆయన రచనపట్ల కొందరు పురుష భావజాలం కలిగిన వాళ్లు అప్పట్లో ద్వేషించినప్పటికీ, నవసమాజానికి ఇవి నాంది పలికే ఆ రోజుల్లో స్త్రీలకు సంబంధించిన శారీరక సమస్యలను వ్యాధులకోసం బహిరంగంగా చర్చించిన ఆయన రచనలు మహిళా లోకానికి ఒక పునాది వేశాయి. అలాంటి చలానికి కాకినాడ ప్రాంతంతో ఎంతో అనుబంధం ఉంది. కృష్ణా జిల్లావాసి అయినప్పటికీ పీఆర్ కాలేజీలో చదువుకుని ఉన్నత చదువులకు మద్రాసు వెళ్లి అక్కడ కూడా చదువు పూర్తయిన తర్వాత తిరిగి కాకినాడ వచ్చి కళాశాల మీద ఉన్న అభిమానంతో పీఆర్ కాలేజీలో తిరిగి ట్యూటర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. ఆయన రచనలకు నాంది పలకడానికి కాకినాడ ఒక సుప్రసిద్ధ వేదిక అయింది. ఎంతో మంది రచయితలకు ఆయన రచనలు ఒక మార్గాన్ని సూచించాయి. ఆయనపై పరిశోధనలకు ఆయన పుస్తకాలే ఆ యుధాలయ్యాయి. నేడు స్త్రీలు కోరుకుంటున్న స్వేచ్ఛను వందేళ్లక్రితమే ఆయన సూచించారు. స్త్రీవాదైన చలం ఎంతోమందికి ఆదర్శప్రాయుడు.

ఆధ్యాత్మికత కోసం బ్రహ్మ సమాజం

చలం బ్రహ్మసమాజానికి స్వచ్ఛందంగా చేరి ఆ వేదిక ద్వారా తన ఆధ్యాత్మికతను, తత్వశాస్త్రాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని తీర్చిదిద్దుకున్నాడు. ఆ అనుభవాల ప్రభావంతో వచ్చిన రచనలు ఆయన జీవితంలో ముఖ్యమైన మలుపును సూచిస్తాయి. ఆయన బ్రహ్మసమాజంలో కొంత కాలంసభ్యుడిగా ఉన్నప్పుడు పొందిన ఆలోచనలు, నిరాశలు, తాత్విక సందేహాలవన్నీ ఆయన రచనల్లో ప్రతిఫలించాయి. చలం శశిరేఖ, దైవమిచ్చిన భార్య, ప్రేమలేఖలు, జీవితాదర్శం వంటి రచనలతోపాటు తత్వవిజ్ఞానం, ఆధ్యాత్మిక స్వేచ్ఛ, దైవసంబంధం వంటి అంశాలపై పలు వ్యాసారాలు రాశారు. ఆయన బ్రహ్మ సమాజంలో తాను పొందినది ఏంటి, కోల్పోయినది ఏంటి అనే విషయాలపై స్వయంగా స్పందించారు. బ్రహ్మ సమాజం చలం మొదటిసారిగా ఒక వ్యూహాత్మక తాత్విక వేదిక ఇచ్చింది. ఆయనకి సంస్థాగత ఆచారాలు కంటే వ్యక్తిగత అన్వేషణ, జీవ అనుభూతి ఎక్కువగా ప్రాధాన్యంగా కనిపించాయి. చివరకు చలం తాను స్వతంత్ర ఆలోచనకర్తగా మారడానికి బ్రహ్మ సమాజం ఒక పాఠశాలా పనిచేసింది.

మైదానం.. ఇప్పటికీ సంచలనం



తొలితరం జర్నలిస్టులు చలం రచనలపై ఎంతో పరిశోధన చేసేవారు. ఈ నాటికీ పుస్తక ప్రియులకు, సామాజిక కార్యకర్తలకు, స్త్రీ వాదులకు సమాజం సమానత పాటించాలని కోరుకునే వారికి చలం రచనలు ఒక మార్గాన్ని సూచించాయి. ఇవి మాట్లాడకూడదు అనుకునే రోజుల్లో ఇవి కూడా మాట్లాడాలి.. అని నిరూపించినవే చలం ఆలోచనలు, రచనలు. ఆయన మైదానం పుస్తకం ఇప్పటికీ ఒక సంచలనం.

-నగేష్ బూర్తి, సీనియర్ జర్నలిస్టు, కాకినాడ

85ఏళ్ల సత్యాన్వేషి



ఒక అన్వేషిగా 85ఏళ్ల ఆయన చేసిన ప్రయాణసారాన్ని సహేతుకంగా వివరించిన పుస్తకం సత్యాన్వేషి. విశ్వవిద్యాలయాల పరిధిలో చలం మొత్తాన్ని ఒక అంశంగా తీసుకుని సత్యాన్వేషిగా ఆయన్ను నిరూపించిన సమగ్ర పరిశోధనకు నాకు ఆంధ్రవిశ్వవిద్యాలయం స్వర్ణపతకాన్ని బహుకరించింది. సత్యాన్వేషి అయిన చలం రచనలు మరో వందేళ్ల తర్వాత కూడా సమాజానికి తప్పనిసరి అవసరం.

-వాడ్రేవు వీరలక్ష్మిదేవి, రచయిత్రి, కాకినాడ

తీర్థయాత్రలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం, మే 17(ఆంధ్రజ్యోతి): వేసవిలో తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైళ్లను నడుపుతోందని సంస్థ జేజీఎం కిషోర్ తెలిపారు. మే 22 నుంచి 30 వరకూ జరిగే దివ్య దక్షిణ యాత్రలో అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు చూడవచ్చన్నారు. ఈ రైలు రాజమండ్రి రాదని, ఈ ప్రాంతంవారు విజయవాడలో ఎక్కవచ్చని తెలిపారు. అలాగే జూన్ 14 నుంచి 22 వరకూ గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా వారాణసీ, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ్‌రాజ్, శంగవర్పూర్ ప్రాంతాలను దర్శించవచ్చన్నారు. ఈ రైలు రాజమండ్రి వస్తుందన్నారు. జూలై 5 నుంచి 13 వరకూ ఐదు జ్యోతిర్లింగాల యాత్రలో త్రయంబకేశ్వర్, భీమ శంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా గుహలు, మోవ్, నాగ్పూర్‌లను చూడవచ్చన్నారు. ఈ రైలు సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ గుండా వెళ్తుందన్నారు. మరిన్ని వివరాలకు 9701360701లో సంప్రదించాలని కోరారు.

మెము రైలు తాత్కాలికంగా రద్దు

సామర్లకోట, మే 17 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం-విశాఖల మధ్య రాకపోకలు సాగించే మెము రైలును తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు రాత్రి అందిన సమాచారం మేరకు 67286 నంబరు గల మెము రైలును ఈ నెల 17 ఆదివారం నుంచి 19 మంగళవారం వరకూ తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు.

పాపం పండినట్టే!

తొండంగి విలేకరి హత్యకేసు విచారణలో కీలక మలుపు

- కేసులో సమర్ధ వాదనకు స్పెషల్ కౌన్సిల్‌గా మోహనమురళీని దించిన ప్రభుత్వం
- సీబీఐ తరపున క్రిమినల్ కేసులు వాదించడంలో మురళీ దిట్టగా గుర్తింపు
- జీవోఆర్టీ నెంబరు 771జారీ చేసిన రాష్ట్ర హోంశాఖ
- ప్రభుత్వం మారడంతో ఇప్పటికే ఈ కేసును మళ్లీ లోతుగా విచారిస్తోన్న సీఐడీ
- దాడిశెట్టి రాజా ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించి ఇప్పటికే ఏ1గా చేర్చేందుకు నిర్ణయం
- అటు హత్యకు సంబంధించి పూర్తిగా లోతైన ఆధారాల సేకరణలో నిమగ్నం
- హత్య అనంతరం నమోదు చేసిన చార్జిషీటూ తప్పులతడక
- దీనివెనుక కారణాలపైనా దర్యాప్తు
- త్వరలో పక్కా ఆధారాలతో కొత్తగా మరో చార్జిషీటు దాఖలకు ప్రయత్నం



హత్యకు గురైన సత్యనారాయణ (ఫైల్)

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి తొండంగి విలేకరి కాతా సత్యనారాయణ హత్య కేసు విచారణలో కీలక మలుపు చోటు చేసుకుంది. న్యాయస్థానంలో ఈ కేసును సమర్థవంతంగా వాదించి నిందితులకు శిక్ష పడేలా చేయడానికి ప్రభుత్వం స్పెషల్ కౌన్సిల్‌ను నియమించింది. గతంలో సీబీఐ తరఫున క్రిమినల్ కేసులు వాదించిన కాకినాడకు చెందిన న్యాయవాది మోహనమురళీని రంగంలోకి దించింది. ఈమేరకు హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. అటు ఇప్పటికే ఈకేసులో రాజమహేంద్ర వరం సీఐడీ విచారణలో స్పీడు పెంచింది. ప్రభుత్వం మారడంతో పాతకేసులో లోపాలను సరిదిద్ది మళ్లీ కేసు విచారణ చేపట్టింది. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పాత్రను నిర్ధారిస్తూ త్వరలో కొత్త చార్జిషీటు దాఖలకు సిద్ధమవుతోంది. మరోపక్క, ఈ కేసులో తనను అరెస్ట్ చేయకుండా ఆదేశాలు జారీచేయాలని రాజా హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం బెయిల్ తిరస్కరించింది.

కిరాతకంగా నరికించినా బయటే...

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం ఆంధ్రజ్యోతి విలేకరిగా పని చేసిన కాతా సత్యనారాయణ 2019 అక్టోబరు 15న హత్యకు గురయ్యారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో రాత్రివేళ కొందరు అగంతకులు అప్పటి తుని వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న దాడిశెట్టి రాజా నివాసానికి దగ్గరలో లక్ష్మీదేవి చెరువు గట్టుపై మాటు వేసి సత్యనారాయణను హత మార్చారు. ద్విచక్రవాహనంపై ఎస్.అన్నవరంలోని తన నివాసానికి చేరుకునే క్రమంలో కిరాయి రౌడీలు మారణాయుధాలతో సత్యనారాయణను అతి కిరాతకంగా హతమార్చడం అప్పట్లో సంచలనమైంది. ఈ సంఘటనపై అప్పట్లో ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు తునిలో ఆందో ళనబాట పట్టాయి. ఈ హత్యకు వైసీపీ నేత దాడిశెట్టి రాజా సూత్రధారి అని మృతుడి కుటుంబసభ్యులు అప్పట్లో ఆరోపి ంచారు. పైగా హత్యకు కొన్ని రోజుల ముందు సెప్టెంబరులో తనకు రాజా అనుచరుల నుంచి బెదిరింపు ఫోన్లు వస్తున్నాయంటూ ఆధారాలతో సత్యనారా యణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా రాజా ఒత్తిడితో పోలీసులు పట్టించు కోలేదు. అయితే సంచలనం రేకెత్తించిన ఈ కేసుపై తుని రూరల్ పోలీసులు అప్పుడు కేసు నమోదు చేసి దాడిశెట్టి రాజాతో పాటుగా ఆరుగురి నిందితులను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. అయితే అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న దాడిశెట్టి రాజా కేసును నీరుగార్చడంతో పాటు ఆయనతో పాటు కేసులో ఉన్న కొందరు అనుచరులను కేసు నుంచి బయటపడేసేందుకు తన అధికారం అడ్డం పెట్టుకున్నారు. కేసు నమోదైనా అరెస్ట్ అవకుండా అప్పటి అధికార పార్టీ పెద్దల ద్వారా పోలీసులపైఒత్తిడి తెచ్చారు.

హత్యతో సంబంధం లేదని బుకాయింపు

ఈలోపు దాడిశెట్టి రాజాకు మంత్రి పదవి లభించింది. దీంతో కేసు మరింత నీరుగారిపోయింది. అసలే రాజా మంత్రి కావడంతో అప్పటి పోలీసులు ఆయన జోలికి వెళ్లడానికి సాహసించలేదు. తెరవెనుక ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లు కూడా ఉండడంతో 2023లో దాఖలు చేసిన చార్జ్‌షీట్ నుంచి మంత్రిగా ఉన్న దాడిశెట్టి రాజా పేరును పోలీసులు తొలగించారు. అసలు రాజాకు హత్యతో సంబంధం లేదని బుకాయించారు. ఆర్థిక కారణాలతో హత్య జరిగిందంటూ కేసును తప్పుదోవ పట్టించి మమ అనిపించారు. దీనిపై న్యాయవాది అయిన సత్యనారాయణ సోదరుడు గోపాలకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజా పాత్రకు సంబంధించి ఆధారాలు, పలుసార్లు రాజా అనుచరులు తన సోదరుడిని బెదిరించిన ఘటనలకు సంబం ధించిన వివరాలు న్యాయస్థానానికి అందించారు. అటు అసెంబ్లీ ఎన్నికలకు ముందు నారా లోకేశ్ యువగళం పాద యాత్రలో తుని వచ్చిన సమయంలో సత్యనారా యణ కుటుంబ సభ్యులులోకేశ్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. రాజా తన అధికారాన్ని అడ్డం పెట్టు కుని కేసు లేకుండా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో లోకేశ్ స్పందిస్తూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తప్పకుండా న్యాయం చే స్తామని హామీఇచ్చారు. అనుకున్నట్లుగానే ప్రభుత్వం మారడంతో పోలీసులు మళ్లీ హత్య కేసును తిరిగి తెరిచారు. ఆధారాలున్నా సరే రాజాపై కేసు నమోదు చేయకుండా అప్పటి పోలీసులు వ్యవహరించారని తేల్చారు. దీంతో కొన్నినెలల కిందట తిరిగి దాడిశెట్టి రాజాను పోలీసులు హత్య కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఫలితంగా అరెస్ట్ తప్పదనే భయంతో రాజా ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయ స్థానం రాజాకు ముందస్తు బెయిల్ నిరాకరించింది. పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. ఇదిలా ఉంటే గతేడాది నవంబరులో ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో రాజమ హేంద్రవరం సీఐడీ డీఎస్పీ ఆధ్వర్యంలో ఈ కేసుపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. హత్యకు ముందు తర్వాత జరిగిన పరిణామాలు, సత్యనారాయణకు వచ్చిన బెదిరింపులు, హత్య తర్వాత కేసు నమోదు, చార్జిషీటు దాఖలు వెనుక ఒత్తిళ్లు వీటన్నింటిపై లోతుగా దర్యాప్తు కొనసాగిస్తోంది. వీటన్నింటి క్రోడీకరించి పక్కా ఆధారాలతో త్వరలో అరెస్టులు, కొత్తగా చార్జిషీటు దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. అయితే కేసులో లోతైన దర్యాప్తు జరిగితే తమకు ఉచ్చుబిగుసుకోవడం ఖాయమనే భయంతో కేసులో నిందితులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. తదుపరి విచారణ జరగకుండా స్టే కోరారు. దీన్ని వెకేట్ చేయించేందుకు అటుప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఇక కేసు పరుగే..

కాతా సత్యనారాయణ హత్యకేసు విచారణకు సంబంధించి ప్రస్తుతం న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు అంత సమర్థవంతంగా లేవని బాధిత కుటుంబం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కేసు విచారణలో తరచు ప్రభుత్వ న్యాయవాదులు మారుతుండడంతో అదేపనిగా విచారణలో కాలయాపన జరుగుతోందని చెబుతోంది. ఈ నేపథ్యంలో ఇకపై ఆసమస్యలు లేకుండా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విచారణ వేగంగా జరిగి బాధితులకు న్యాయం జరిగేలా చేయడం కోసం ప్రత్యేకంగా స్పెషల్ కౌన్సిల్‌ను నియమించింది. జి.మోహన మురళీ అనే న్యాయవాదిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. కాకినాడకు చెందిన మురళీ గతంలో కాకినాడ మూడో జిల్లా కోర్టు ఏపీపీగా పనిచేశారు. ముంబైలో సీబీఐ పీపీగా అనేక క్రిమినల్ కేసులను సమర్థవంతంగా వాదించారు. విలేకరి హత్య కేసు విచారణలో సమర్థవంతంగా ప్రాసిక్యూషన్ వాదన వినిపించడం కోసం ప్రభుత్వం ఈయన్ను రంగంలోకి దించడం కేసు విచారణలో కీలక మలుపనే చెప్పాలి.

దైవ దర్శనానికి పయనమై.. అనంతలోకాలకు!

- పాదయాత్ర చేస్తుండగా ఢీకొన్న వాహనం
- పిఠాపురంలో భక్తురాలు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



ఫైల్‌ఫొటో



పిఠాపురం బైపాస్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో మరణించిన చంద్రకళ

పిఠాపురం/గొల్లప్రోలు, మే 17 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి పాదయాత్రగా ఇంటి నుంచి బయలుదేరిన మహిళ మరణించింది. దర్శనం చేసుకుని వచ్చేస్తానని చెప్పిన ఆమె ఇక రాదని తెలుసుకుని భర్త, కుమారుడు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాకినా డ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన అడపా చంద్రకళ(35), తొగరు సూర్యలక్ష్మి శనివారం ఉదయం 5గంటలకు ఇంటి వద్ద నుంచి కాలినడకన దివిలి వద్ద గల తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి దర్శనానికి బయలుదేరారు. పిఠాపురం బైపాస్‌రోడ్డులో రాపర్తి సెంటర్ సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ప్రమాదంలో చంద్రకళ అక్కడికక్కడే మరణించగా, సూర్యలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. సూర్యలక్ష్మిని చికిత్స నిమిత్తం ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. చంద్రకళకు భర్త త్రిమూర్తులు, కుమారుడు రాజేష్ ఉన్నారు. త్రిమూర్తులు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాజేష్ పదో తరగతి పూర్తి చేసుకుని పిఠాపురంలోని కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. రాజేష్‌ను మేనమామ చదివిస్తున్నాడు. వీరు పూరిపాకలో నివసిస్తున్నారు. చంద్రకళ మరణవార్త విని భర్త, కుమారుడు, బంధువుల్లో విషాదం అలముకుంది. తొలి తిరుపతి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిందని, ఇలా మరణవార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన మహిళను ఆసుపత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

గుడికి వెళ్లి వస్తుండగా విషాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు
- మహిళ మృతి
- నలుగురికి తీవ్రగాయాలు



సంఘటనా స్థలంలో బస్సు, కారు



మృతి చెందిన రేఖాలక్ష్మి



గాయపడిన శ్రావణ్‌కుమార్

అంబాజీపేట, మే 17(ఆంధ్రజ్యోతి): గుడికి వెళ్లి వస్తూ ఓ కుటుంబం ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ బస్సును కారు ఢీకొనడంతో మహిళ మృతిచెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల- వక్కలంక వంతెన సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన దొమ్మేటి శ్రావణ్‌కుమార్, అతడి భార్య రేఖాలక్ష్మి, కుమార్తెలు లాస్య, మోహనగని ప్రియరేఖా అమ్మమ్మ కె.ధనలక్ష్మితో కలిసి వారం రోజులుగా క్రితం కోనసీమ జిల్లా వానపల్లిలో జరిగే పళ్లాలమ్మ తీర్థానికి వచ్చారు. వారం పాటు బంధువుల ఇళ్లకు ఆనందంగా తిరిగారు. శనివారం కారులో ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దైవదర్శనానికి వెళ్లి అమలాపురం వైపు ఫ్రెంచ్ యానాం వెళ్తుండగా అమలాపురం నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును వక్కలంక వంతెన సమీపంలోకి వచ్చేసరికి బలంగా కారు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్రగాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా రేఖాలక్ష్మి(38) మృతిచెందింది. శ్రావణ్‌కుమార్, మోహనగనిప్రియ, లాస్య, ధనలక్ష్మిలకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కారు నుజ్జునుజ్జయింది. ప్రమాద స్థలాన్ని ఎస్ఐ కె.చిరంజీవి పరిశీలించి వివరాలు సేకరించారు. రేఖాలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. శ్రావణ్ కుమార్ స్వగ్రామం ఫ్రెంచి యానాం కాగా ఆయన రంగారెడ్డి జిల్లా నిజామ్‌పేటలో స్థిరపడ్డారు. రేఖాలక్ష్మి అమ్మగారి ఇళ్లు అమలాపురం.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ముమ్మిడివరం: బొండాయికోడులో మృతిచెందిన సత్యనారాయణరాజు

ముమ్మిడివరం, మే 17(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ బొండాయికోడు పెట్రోలు బంకు వద్ద శనివారం జరిగింది. అయినవిల్లి మండలం పోతుకుర్రు గ్రామానికి చెందిన సాగిరాజు సత్యనారాయణరాజు (47) చెరువులు దగ్గరికి వెళ్తూ పెట్రోల్ బంకులో డీజిల్ కొట్టించుకునేందుకు వెళుతుండగా ఎదురుగా అమలాపురం వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో సత్యనారాయణరాజు తీవ్రంగా గాయపడ్డాడు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సత్యనారాయణకు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కత్తిపూడిలో...

శంఖవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో ఓ సినిమాహాలు ఆవరణలో లారీ ఢీకొనడంతో గొంతాల అప్పలరాజు(48) మృతిచెందాడు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన అప్పలరాజు కత్తిపూడిలో నివాసం ఉంటున్నాడు. కూల్‌డ్రింక్ గోడౌన్ వద్ద లోడుతో ఓ లారీ ఆగి ఉంది. నీడగా ఉంటుందని లారీ కింద విశ్రాంతి తీసుకునేందుకు వెళ్లాడు. అతడిని గుర్తించని లారీ డ్రైవర్ ముందుకు వెళ్లడంతో అప్పలరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.



కత్తిపూడిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీహరిబాబు

గోదావరిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఆత్రేయపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): గౌతమి గోదావరిలో బహిర్భూమికి వెళ్లి కాలు జారి గల్లంతైన యువకుడు మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన తలపాకుల జగపతిబాబు(20) హైదరబాద్‌లో ఓ కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఆత్రేయపురం బుల్లిపేటలో తన మేనమామ కుమారుడు పుట్టిన రోజు వేడుకకు వచ్చాడు. మధ్యాహ్నం గోదావరి వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టగా శనివారం సాయంత్రం రావులపాలెం జొన్నాడ బ్రిడ్జి వద్ద మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము చెప్పారు.



జగపతిబాబు మృతదేహం

సామర్లకోట చైర్‌పర్సన్ రాజీనామా లేఖ ఉపసంహరణ

సామర్లకోట, మే 17 (ఆంధ్రజ్యోతి): తన పదవికి రాజీనామా చేసిన కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.అరుణ తన రాజీనామా లేఖ ఉపసంహరించుకుంటున్నట్టు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యకు శనివారం లేఖ అందజేశారు. ఈనెల 15న కమిషనర్‌కు అందజేసిన రాజీనామా పత్రాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు తెలిపారు. అదేరోజు జరిగిన మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో వైసీపీకి చెందిన 25మంది మెజార్టీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించి నెగ్గిన విషయం విధితమే. అయితే తాను కోర్టులో చేసిన అభ్యర్థన కోర్టు పరిశీలనలో ఉన్నందున రాజీనామా ఉప సంహరించుకుంటున్నట్టు అరుణ తెలిపారు. కాగా కౌన్సిల్‌లో అనిశ్చిత పరిస్థితులపై ఉన్న తాధికారుల లేఖ రాసినట్టు ఆ మేరకు వెలువడే ఉత్తర్వుల ద్వారా తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.



కమిషనర్‌కు రాజీనామా ఉపసంహరణ లేఖను అందజేస్తున్న అరుణ

పోక్సో కేసు తీవ్రత ఆధారంగా నిందితులపై రౌడీషీట్

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

రాజమహేంద్రవరం/ ఉండ్రాజవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు తీవ్రత ఆధారంగా నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన తూర్పుగోదావరి రాజమహేంద్రవరంలో జిల్లా పోలీసు కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో వార్షిక తనిఖీలు చేశారు. తొలుత జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని ఏఆర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్ విగ్రహాన్ని ప్రారంభించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌బీ, డీసీఆర్‌బీ, కంట్రోల్ రూమ్, ఐటీ కోర్, ఏఆర్, ఎంటీ తదితర విభాగాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అతి తీవ్ర, తీవ్ర నేరాల దర్యాప్తులపై ఆరా తీశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లోని పబ్లిక్ అడ్రసింగ్ వ్యవస్థ, కౌన్సెలింగ్ కేంద్రాలు, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫ్రెండ్లీ, విజిబుల్ పోలీసింగ్‌కి ప్రాధాన్యమివ్వాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి రిమార్కు లేకుండా సర్వీసు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలోని శాంతి భద్రతలు, నేరాల తీరును ఎస్పీ నరసింహ కిశోర్ వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీ ఎం.మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే సాయంత్రం ఆయన ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి విలేకర్లతో మాట్లాడారు. ప్రజలు తమ ఫిర్యాదులను వెబ్‌సైట్ ద్వారా అందజేసి పోలీసు సాంకేతికను వినియోగించుకోవలాని సూచించారు. రాజమండ్రిలో గంజాయి రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టేషన్‌లో పలు రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ జి.దేవకుమార్, సీఐ పీవీజీ తిలక్, ఎస్ఐ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో అశోక్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇద్దరి ఆత్మహత్య

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో రైలు కింద పడి దుర్మరణం



పోసిబాబు (ఫైల్)

సామర్లకోట, మే 17 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో మనస్తాపంతో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్ల పాలెం రైల్వేస్టేషన్ రైలు పట్టాల వద్ద రైలు కింద తలలు పెట్టి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే కాకినాడకు చెందిన ఉప్పల పోసిబాబు(37)ప్రైవేట్ అకౌంటెంట్. 15 ఏళ్ల క్రితమే వివాహమై 14ఏళ్ల కుమారుడు, 12 ఏళ్ల కుమార్తె ఉన్నారు. ఇటీవల కాకినాడలో ఒక ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేస్తున్న వివాహిత దివ్య నాగలక్ష్మి(30) పరిచయం కావడంతో అది వివాహేతర సంబంధానికి దారితీసింది. అప్పటికే వివాహమైన దివ్యకు 8 ఏళ్ల కుమార్తె ఉంది. పోసిబాబు, దివ్య మధ్య రెండో వివాహం చేసుకోవాలనుకున్నారు. 4 రోజుల క్రితం పోసిబాబు ఈ విషయం సూత్రప్రాయంగా చెప్పి పక్క ఇంటిలోనే కాపురం ఉంటుందని చెప్పడంతో భార్య తీవ్రంగా వ్యతిరేకించింది. పలువురు పెద్దలతో చెప్పడంతో ఇటువంటి వ్యవహారం మంచిది కాదని సూచించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన పోసిబాబు, నాగలక్ష్మి కలిసి ఆత్మహత్యకు చేసుకుందామని నిర్ణయించుకుని శనివారం ఉదయం కాకి నాడ నుంచి వేట్లపాలెం రైల్వే స్టేషన్‌కు చేరు కున్నారు. వేగంగా వెళ్తున్న రైలు కింద తలలు పెట్టడంతో వారి శరీరాలు ముక్క ముక్కలయ్యాయి. ముఖాలు పూర్తిగా ఛిద్రం కావడంతో గుర్తుపట్టలేని రీతిలో మారాయి. మృతదేహాల వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని కాకినాడ లోని ఇరు కుటుంబాల వ్యక్తులకు సమాచారం అందించారు. తమ అనుబంధానికి కుటుంబ సభ్యులే గాకుండా పెద్దలు సైతం అడ్డు తగి లారని అందుకే బతుకుపై విరక్తి చెంది ఆత్మ హత్యకు పాల్పడుతున్నామని రాసినట్టు పోలీసులు గుర్తించారు. ఆర్థిక పరమైన అంశాలు సైతం సూసైడ్ నోట్‌లో పొందుపరిచినట్లు సమాచా రం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించి రైల్వే ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

కోకో రైతులను ఆదుకుంటాం : మంత్రి దుర్గేష్

నిడదవోలు, మే 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో కోకో గింజలను కిలో రూ.500 ధరకు కొనుగోలు చేసేందుకు మాండలీజ్ సంస్థ అంగీకరించిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మంత్రి క్యాంపు కార్యాలయంలో కోకో రైతులు, ట్రేడర్లు అధికారులతో ఆయన కోకో కొనుగోళ్లు, గిట్టుబాటు ధరలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 2520 హెక్టార్ల దిగుబడి విస్తీర్ణంలో 2353 మంది రైతులకు సుమారు 2000 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని, రైతులు అహర్నిశలు శ్రమించి పండించిన కోకో గింజలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం కోకో రైతులకు అండగా ఉంటుందని హామీ ఇవ్వడంతో తమ ఆందోళన విర మిస్తున్నట్టు కోకో రైతులు ప్రకటించారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో రాణీ సుస్మిత, హార్టికల్చర్ అధికారి బి.సుజాత, జిల్లాలోని కోకో రైతులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ చిత్రం విడుదల



సీసీ ఫుటేజీలో చైన్ స్నాచర్

కరప, మే 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో బాలిక మెడలోని బంగారు గొలుసును అపహరించుకుపోయిన చైన్ స్నాచర్ చిత్రాన్ని శనివారం కరప పోలీసులు విడుదల చేశారు. ఎస్ఐ తోట సునీత మాట్లాడుతూ నక్కా లక్ష్మీఅలేఖ్య అనే మహిళ ఈనెల 11న కుమార్తె హాసికను స్కూటీపై ఎక్కించుకుని కాకినాడ నుంచి కరప మండలం జడ్.బావారానికి బయలుదేరింది. వీరిని అనుసరిస్తూ వచ్చిన చైన్‌స్నాచర్ కరప డంపింగ్ యార్డు వద్ద హాసిక మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. పలు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. నిందితుడు ముఖానికి మాస్క్ ధరించి ఉన్నాడని, ఫేక్ నెంబర్ బోర్డు తగిలించుకున్న మోటార్‌సైకిల్‌పై వచ్చి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడని తెలిపారు. ఆచూకీ తెలిస్తే కరప పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచి బహుమతి ఇస్తామని ఎస్ఐ ప్రకటించారు.

రేపు పిఠాపురంలో పీజీఆర్ఎస్

పిఠాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండువద్ద గల పాడా కార్యాలయంలో ఈనెల 19న సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పీడీ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఈ పీజీఆర్ఎస్‌కు పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన డివిజన్, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆమె ఆదేశించారు. ప్రజలు పీజీఆర్ఎస్‌ను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

● పలుచోట్ల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమాల

కాకినాడ క్రైం, మే 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్య త అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఆర్ఎంసీలో కాకినాడ రంగరాయ వైద్యకళాశాల(ఆర్ఎంసీ) ప్రాంగణంలో స్వర్ణాం ధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే కొండబాబు హాజరై మాట్లాడారు. ఆర్ఎంసీ ప్రాంగణాన్ని శుభ్రపర్చి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కాకినాడ జీజీహెచ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసన్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వి.వరప్రసాద్, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య, పరిపాలనా విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యమున, రేడియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అనురాధ, నర్సింగ్ సూపరింటెండెంట్లు సంధ్యారాణి, విజయశ్రీ, మినిస్టీరియల్ సంఘ నాయకులు పాలపర్తి మూర్తిబాబు, పేపకాయల కృష్ణ, కట్టిమేను మోహన్ పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణాన్ని ఇంకుడు గుంతలు తవ్వి, పరిసరాలు శుభ్రపర్చి మొక్కలు నాటారు. అధికారులు, సిబ్బందితో ఎస్పీ స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. జిల్లావ్యాప్తంగా పోలీస్‌స్టేషన్‌లు, ఆఫీస్‌ల్లో ఇంకుడు గుంతలు తవ్వి, శుభ్రపర్చి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజెవీ భాస్కర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో ఐఏఎస్ అధికారి మనీష్‌దేవరాజ్‌పాటిల్ ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామ కోటేశ్వరరావు, ట్రాఫిక్ సీఐలు ఎస్.రమేష్, డి.రామారావు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ జి.చిన్నారావు, ఎంపీడీవో పి.రవికుమార్ కొత్తపల్లి చెత్త సంపద కేంద్రంలో మొక్కలను నాటారు. ఈవోపీఆర్డీ హరికృష్ణ సత్యారెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, ఆర్ఎస్‌కుమార్ పాల్గొన్నారు.

కరప: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ ఎంపీడీవో మట్టపర్తి అనుపమ చేయించారు. ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఉపాధి సిబ్బంది తవ్విన కంపోస్ట్ పిట్‌లను సందర్శించి సూచనలు చేశారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు చలివేంద్రాలను ఏర్పాటు చేసి దాహార్తులకు మజ్జిగ అందజేశారు. డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు ఉపాధి కూలీలతో సమావేశమై వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో యండమూరి హేమమాధవి, హౌసింగ్ ఏఈ పెండెం నాగేష్ పాల్గొన్నారు.

పిఠాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కొండబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్


కరపలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో అనుపమ, సిబ్బంది


పిఠాపురం పాడా కార్యాలయంలో మొక్కలు నాటుతున్న పీడీ చైత్రవర్షిణి

పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి సూచించారు. పిఠాపురం పట్టణంలోని పాడా కార్యాలయ ఆవరణలో అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె శనివారం మొక్కలు నాటారు. ఏపీడీ వసంతమాధవి పాల్గొన్నారు.

గొల్లప్రోలు: పట్టణంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బీట్ హీట్ అంటూ గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయం, పాపయ్యచావిడి వీధి తదితర ప్రాంతాల్లో మానవహారం నిర్మించారు. తహసీల్దారు సత్యనారాయణ, నగర పంచాయతీ కమిషనరు కనకారావు పాల్గొన్నారు.

స్వచ్ఛదివాస్ కార్యక్రమాలకు సహకరించాలి: ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట: స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే చినరాజప్ప పిలుపునిచ్చారు. సామర్లకోట పట్టణ పరిధి బలుసులపేటలో సామర్లకోట మున్సిపల్ యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుమారరామభీమేశ్వరాలయం ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్‌ల్లో భాగంగా ఆలయ ఆవరణను పరిశుభ్రం చేశారు. ఈవో బళ్ల నీలకంఠం, అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ, ఆలయ పండితుడురాంబాబు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో వర్సిటీలోని ఐఎస్టీ సమీపంలోని జంగిల్‌బుక్ వద్దగల చెరువును శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ యూనిట్ కేర్ టేకర్ డాక్టర్ లక్ష్మణ్ కిషోర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు కాకినాడ సిటీ నియోజకవర్గ మినీ మహానాడు

● ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ, మే17 (ఆంధ్రజ్యోతి): కాకినాడసిటీ నియోజకవర్గ మినీ మహానాడు-2025ను ఈనెల 18వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక సూర్యకళా మందిరంలో నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లుచేశారు. ఈ ఏర్పాట్లను శనివారం సాయంత్రం టీడీపీ శ్రేణులతో కలిసి సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పరిశీలించారు. సభావేదిక, ఎల్‌సీడీ స్క్రీన్‌లు, సమావేశహాల్, డైనింగ్ హాల్‌ల్లో ఏర్పాట్లపై ఎమ్మెల్యే కొండబాబు పలు సూచనలు చేశారు. ఈ మినీ మహానాడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చేలా సన్నాహాలు చేపట్టారు. ఈమినీ మహానాడులో పార్టీ భవి ష్యత్



మినీ మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కార్యాచరణ, నగర అభివృద్ధి తదితర అంశాలపై చర్చించి తీర్మానాలుచేసి జిల్లాస్థాయి మహానాడుకు పంపనున్నారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కాకినాడ మార్కెట్‌కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పంతాడి రాజు, కాకినాడ బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, పార్టీ నాయకులు ఎంఏ తాజుద్దీన్, తుమ్మల రమేష్, చొల్లంగి వీరబాబు, చింతలపూడి రవి, గాది శివరామ్మకృష్ణ, బంగారు సత్యనారాయణ, కేశంగి ప్రసాద్, అమ లకంటి బలరామ్, రెడ్నం సత్తిబాబు, జహరుద్దీన్ జిలాని, కశింకోట చంద్రశేఖర్, మూగు రాజు, సంగాడి నాగూర్, పాలిక నాని, వనపత్రి బద్రి, పొంగా బుజ్జి పాల్గొన్నారు.

'కాలుష్యం నుంచి ఏలేరు కాలువను రక్షించండి'

పెద్దాపురం, మే 17(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం, సామర్లకోట మండలాల పరిధిలో కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఏలేరు కాలువను పరరక్షించాలని, పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంవద్ద శనివారం నిరసన నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గంలోని పరిశ్రమలు నిబంధనలు గాలికి వదిలేసి కాలుష్య జలాలను విచ్చలవిడిగా వదిలేస్తున్నారని దాని వలన ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని ఆరోపించారు.

పీఈటీల సంఘ అధ్యక్షుడిగా శ్రీనివాస్


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

కార్పొరేషన్(కాకినాడ),మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడిగా పెద్దిశెట్టి శ్రీనివాస్ భారీ మెజార్టీతో గెలుపొందారు. శనివారం కాకినాడరూరల్ చీడిగలో పీఈటీల సంఘం భవనంలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్లుగా రమేష్‌కుమార్, సాయిశ్రీనివాస్, ఎన్నికల అధికారిగా వి.రవిరాజ్ వ్యవహరించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 191 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని తమఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి శ్రీనివాస్, కౌర్ మధ్య గట్టి పోటీ నెలకొంది. ఈ ఎన్నికలకు 191ఓట్లు పోలింగ్ కాగా, అందులో శ్రీనివాస్‌కు 139, కౌర్‌కు 51ఓట్లు వచ్చాయి. 88ఓట్లు మెజార్టీతో శ్రీనివాస్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రవిరాజ్ తెలిపారు. కార్యదర్శిగా వడపర్తి మాచరావు, కోశాధికారిగా కర్రి నాగలింగేశ్వరరావు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు బంగారురాజు, నూకరాజు, పట్టాభి, శ్రీనివాస్, ప్రసాద్, వాసు, శ్రీను, మంగయమ్మ, చంద్రావతి, త్రిపుల శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి సుభాష్



కార్మికులకు మజ్జిగ అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

సర్పవరంజంక్షన్, మే 17(ఆంధ్ర జ్యోతి): కార్మికుల చట్టాలు పటిష్టంగా అమలు చేస్తామని, కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. శనివారం కాకినాడరూరల్ వాకలపూడి కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ లో పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల్లో భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్ర మంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సు మారు 86 లక్షలమంది కార్మికులు వివిధ రం గాల్లో పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం 12 కార్మిక పథకాలను నిర్వీర్యం చేసింద న్నారు. కార్మికుల భద్రత సంక్షేమం కోసం ఆ రోగ్య భద్రత పథకంకోసం ఈఎస్ఐ ఆసు పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందేలా చ ర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్మికుల సంక్షేమం, భద్రతపై కోరమండల్ సంస్థ తీస ుకుంటున్న పటిష్టచర్యలు అభినంద నీయమన్నారు. 124 ఏళ్ల చరిత్ర కలిగిన కోర మండల్ దేశంలోనే రెండో అతిపెద్ద పాస్ఫేటిక్ ఎరువుల తయారీదారుగా, ప్రైవేట్ రంగంలో ప్రథమస్థానంలో ఉందని, బ్రిటీష్ సేఫ్టీ కౌన్సిల్ నుంచి ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డు పొందిన కోరమండల్‌కు కితాబిచ్చారు. ఈ సందర్భంగా కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ హెడ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన విగ్రహాల పతిష్ఠ పూజలు

సామర్లకోట, మే17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట గోదావరి పుష్కరిణి వద్ద పలువురు దాతల సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఆదియోగ విగ్రహం, దక్షిణా మూర్తి విగ్రహాల ప్రతిష్ఠ పూజా కార్యక్రమం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప శనివారం నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు అందరూ ముందుకురావాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు. ప్రతిష్ఠ పూజా కార్యక్రమాల అనంతరం పుష్పార్చన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు పంతం ప్రసాద్ అనసూయ దంపతులు, కర్రి వెంకట్రాజు, బిక్కిన పరమేశ్వర సాయి సత్యన్నారాయణ, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అసంబద్ధ నిబంధనలను తొలగించాలి

కరప, మే 17(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల్లో అసంబద్ధంగా ఉన్న నిబంధనలను తొలగించాలని పీఆర్‌టీయూ జిల్లా సీపీఎస్ కన్వీనర్ వాకాడ వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ప్రదీప్‌కుమార్‌లు విజ్ఞప్తిచేశారు. నడకుదురు కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యాశాఖ ఏకపక్ష నిర్ణయాలు, నియమాలను వెంటనే సరిచేసి ఉపాధ్యాయుల కు న్యాయం చేయాలన్నారు. ఈనెల 21న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి బండి నూకరాజు, నాగేశ్వరరావు, మంగారావు, పాల్గొన్నారు.

'ఊరేలితే జాగ్రత్తలు తీసుకోండి'

కాకినాడ క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇళ్ల వద్ద ఒంటరిగా ఉన్న మహిళలు, వృద్ధులను టార్గెట్ చేస్తూ అగంతకులు వారితో మాటలు కలిపి ఇళ్లు అద్దెకు తీసుకుని బాగా నమ్మకంగా ఉంటూ అనంతరం ఇంటి యజమానులపై దాడులకు పాల్పడుతూ వారిని తీవ్రంగా గా యపర్చి అందినకాడికి సొమ్ములు కాజేసి ఉడాయిస్తున్నా రు. ఈ నేపథ్యంలో కాకినాడ వన్‌టౌన్ పోలీసులు ప్రజలకు ఆటోల ద్వారా మైక్‌తో స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎవరైనా అద్దెకు ఇంటి కోసం వస్తే సరైన ఆధారాలు లేకుండా అద్దెకు ఇవ్వరాదు. ఇటీవల తాళాలు వేసి ఉన్న ఇళ్లలో, షాపుల లో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంటికి తాళాలు వేసి వేరే ఊళ్లు వెళ్లేవారు సం బంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చి పోలీసుల ఉచిత లాక్డ్‌హౌస్ మోనిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్) సౌకర్యాన్ని వినియోగించుకోవాలని విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లలో భద్రపర్చుకోవాలని ముఖ్యంగా సీసీ కెమెరాలను అమర్చుకుంటే ఎక్కడ దొంగతనం జరిగినా త్వరితగతిన కేసును చేధించవచ్చని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.



పెద్దాపురం: దివిలిలో తిరంగ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప

ప్రతీ పౌరుడు దేశ రక్షణకు సిద్ధంగా ఉండాలి

● తిరంగ ర్యాలీలో ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ పౌరుడు దేశరక్షణకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మండల పరిధిలోని దివిలి సెంటర్‌లో వంద అడుగుల జాతీయజెండాతో సిందూర్ తిరంగ ర్యాలీని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలు వదిలిన ప్రతీ జవానుకు భారతీయులు రుణపడి ఉన్నారన్నారు. విశ్రాంత సైనికోద్యోగి కుంచే పాపారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, బీజేపీ పెద్దాపురం ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, తిరుపతి సర్పంచ్ మెయిళ్ల కృష్ణమూర్తి, గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని, కందుల విశ్వేశ్వరరావు, సత్తిబాబు, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో శ్రీలలిత, ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

సైనికులకు హ్యాట్సాఫ్

కరప: ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి మన త్రివిధ దళాల సత్తా తెలిసొచ్చిందని, ఉగ్రవాదులను మట్టుబెట్టి పాక్‌పై వీరోచితంగా పోరాడిన సైనికులకు హ్యాట్సాఫ్ అని బీజేపీ కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురష్కరించుకుని శనివారం కరపలో కూటమి నాయకులతో కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత సైన్యానికి మద్ధతుగా నినాదాలు చేశారు. బీజేపీ మండలాధ్యక్షురాలు యర్రంనీడి పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన పార్టీ అసెంబ్లీ కన్వీనర్ పితాని లీలావతి, నందూరి సత్తిబాబు, అనపర్తి వెంకటేష్, పాలుపల్లి లక్ష్మణరావు, గోపిశెట్టి సుబ్బలక్ష్మి, ఎం.వెంకటేష్‌ప్రసాద్, చిటిమిరెడ్డి గోవిందరాజులు, మూర్తి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు మద్ధతుగా తిరంగ ర్యాలీ

సర్పవరం జంక్షన్: టెర్రరిస్టుల తూటాలకు బలైపోయిన పర్యాటకుల ఆత్మకు శాంతి, ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌పై భారత త్రివిధ దళాలు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని కాకినాడరూరల్ మండలంలో స్థానిక ఎమ్మెల్యే పంతంనానాజీ పిలుపుతో కూటమి నాయకులు జాతీయ పతా కంతో తిరంగ ర్యాలీ నిర్వహించారు. శనివారం కాకినాడ జేఎన్‌టీయూ నుంచి సర్పవరం జంక్షన్‌వరకు సుమారు కిలోమీటరన్నర మేర జాతీయ పతాకంతో నిర్వహించిన తిరంగా ర్యాలీని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఎమ్మెల్యే తనయుడు పంతం సందీప్, కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, కటకంశెట్టి ప్రభాకర్(బాబీ), ఏపీ గౌడ్‌కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాశ్‌గౌడ్‌లు ప్రారంభించి, మాట్లాడారు. ముందుగా పలువురు మాజీ సైనికులను ఘనంగా సత్క రించారు. కూటమి నాయకులు శిరంగు శ్రీనివాసరావు, తాటికాయల వీరబాబు, నందిపాటి త్రిమూర్తులు, గోపు వెంకటరమణ, పితాని అప్పన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

రక్తపోటుపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

జీజీహెచ్(కాకినాడ) మే 17(ఆంధ్రజ్యోతి): రక్తపోటు (హైపర్‌టెన్షన్)పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శనివారం డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ర్యాలీ, కళాజాత, మానవహారం కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ నాయక్ మాట్లాడుతూ మీ రక్తపోటును కచ్చితంగా కొలవండి, నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించండి. అనే అంశంపై క్షుణ్ణంగా సిబ్బందికి వివరిస్తూ క్రమం తప్పకుండా నడక, యోగా చేయడం, ఆహార నియమావళిని సరైన పద్ధతుల్లో క్రమబద్ధీకరించుకోవడం ద్వారా రక్తపోటును నియంత్రించ వచ్చన్నారు. ముఖ్యంగా 30 ఏళ్ళు దాటిన ప్రతిఒక్కరూ సమీప పీహెచ్‌సీ లేదా యూపీహెచ్‌సీలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా మేరకు మందులు వాడాలన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎల్ఏటీవో డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ అరుణ, డాక్టర్ జి.లక్ష్మి, డాక్టర్ ఐ.ప్రభాకర్, డాక్టర్ విల్సన్, జి.దేవకుమారి, విజయలక్ష్మి, నీలవేణి, డెమో ప్రసాదరాజు పాల్గొన్నారు.

సాధనచేస్తే ఏదైనా సాధించవచ్చు : విజయప్రకాష్


కార్యక్రమంలో పాల్గొన్న శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్‌విజయ్‌ప్రకాష్

కాకినాడ రూరల్, మే17(ఆంధ్రజ్యోతి): సాధనచేస్తే ఏదైనా సాధించవచ్చునని శ్రీప్రకాష్ వి ద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అన్నారు. కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల్లో ప్లస్2 విద్యార్థులకు ది సెవెన్ హ్యాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్ పుస్తకంపై శనివారం సెమినార్ నిర్వహించారు. విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఈపుస్తకాన్ని స్టీఫెన్ కోవి రచించారని ఇది వ్యక్తిగత అభివృద్ధి, నాయకత్వం, సమర్థవంతమైన జీవనశైలిలో దీనిని రాశారన్నారు. ప్రతీ వ్యక్తి సమాజంలో ఏవిధంగా ఎదగాలి, అదే విధంగా ఈపుస్తకాన్ని చదవడంవల్ల వ్యక్తిప్రవర్తనలో ఎటువంటి మార్పు పొందగలడో చక్కగా వివరించారన్నారు. ప్రిన్సిపాల్స్ ఎంవీవీఎస్ మూర్తి, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

పహల్గాంలో పర్యాటకులకు స్వర్గధాయం

● పర్యటించిన ఎమ్మెల్యే పంతం నానాజీ


పహల్గాంలో సందర్శిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరంజంక్షన్, మే17 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ పహల్గాంలో 26మంది పర్యాటకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను భారత త్రివిధ దళాలు హతమార్చి అమరుల ఆత్మకు శాంతి కలిగించాయి. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలతోపాటూ పాకిస్థాన్‌కు త్రివిధ దళాలు తగిన గుణపాఠం చెప్పాయి. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. పహల్గాం పర్యాట కులకు స్వర్గ దామం గట్టి భద్రత మధ్య నిశ్చింతగా సందర్శించవచ్చని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. శనివారం ఆయన కాశ్మీర్ పహల్గాంను సంద ర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టెర్రరిస్టులను పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌పై చేస్తున్న ధర్మ యుద్ధం ఆపరేషన్ సిందూర్‌కు ప్రజలంతా నైతిక మద్ధతు ప్రకటించారన్నారు. టెర్రరిస్టులపై పోరాడుతున్న త్రివిధ దళాలు, ప్రధాని మోదీకి దైవ బలం, ఆశీస్సులు ఉండేలా భగవంతుడ్ని ప్రార్థించాలని జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు ఇచ్చారన్నారు. ఈ మేరకు సుమారు 100మంది జనసైనికులతో తమిళనాడులోని పళని, మధురై, అరుణాచలం, తిరుత్తణి తదితర ప్రాంతాల్లో క్షేత్రాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశామన్నారు.

సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా

కాకినాడ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్‌కోడ్లు రద్దు చేయాలని తలపెట్టిన సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా పడిందని కేంద్ర కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు. స్థానిక కచేరీపేటలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఐఎఫ్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన కేంద్ర కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఏఐఎఫ్టీయూ జిల్లా నాయ కుడు అంజిబాబు, ఐఎన్టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి తాళ్లూరి రాజు మాట్లాడారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్లతో ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె తలపెట్టారన్నారు. అయితే భార త్, పాకిస్తాన్ మధ్య పెరిగిన ఘర్షణ వాతావరం ఇంకా కొనసాగుతుండంతో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జూలై 9న నిర్వహించాలని ఢిల్లీలో జరిగిన కేంద్ర కార్మిక సం ఘాల సమావేశం నిర్ణయించిందన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకరమణ, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు టి.రాజు, దుర్గారావు పాల్గొన్నారు.

హైపర్ టెన్షన్‌పై అవగాహన సదస్సు

సామర్లకోట, మే 17 (ఆంధ్రజ్యోతి):దేశంలో అకాలమరణాలలో హైబీపీ ప్రధానమైనదని, అధిక రక్తపోటు, హైపర్‌టెన్షన్ ఎలాంటి లక్షణాలు చూపకుండా శరీరంలోనే ఉండి పోతుందని మెడికవర్ ఆసుపత్రి ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ వీఆర్ఆర్. వసంతకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు సామర్లకోట మండలం పనసపాడు ఏడీబీ రోడ్డులో గల మెడికవర్ ఆసుపత్రి ఆవరణలో అవగాహన సదస్సు ఆసుపత్రి సెంటర్ హెడ్ శుభాకరరావు అధ్యక్షతన శనివారం సాయంత్రం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంతకుమార్ మాట్లాడు తూ ప్రతీ 8మంది భారతీయులలో ఒకరు రక్తపోటుతో బాధపడుతున్నారన్నారు. అలనంతరం ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ ఏడాది తప్పకుండా గుండెపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సెంటర్ హెడ్ శుభాకరరావు తదితర డాక్టర్లు పాల్గొన్నారు.


ప్రత్యేక అంకరణలో శృంగారవల్లభస్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సు మారు 15వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. రూ.2,97,980 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పించాలి

● జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), మే 17 (ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం సికిల్ సెల్ వ్యాధిపై కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి ప్రాబల్యాన్ని తగ్గించడానికి భారతప్రభుత్వం అన్నిలైన్ల విభాగాలతో జిల్లాస్థాయి కమిటీను ఏర్పాటు చేసిందన్నారు. సున్నా నుంచి 40 ఏళ్లలోపు వారిని సర్వే చేసి వారికి స్క్రీనింగ్ చేయాలన్నారు. ఈ వ్యాధి వారసత్వంగా వచ్చే ఎర్ర రక్తకణాల రుగ్మత అన్నారు. ఇది తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందన్నారు. సామాన్యంగా సాధారణ ఆరోగ్యకరమైన ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటే సికిల్ వ్యాధి రక్తకణాలు కొడవలి తరహాలో అర్థ చంద్రాకారంలో ఉంటాయన్నారు. ఈ వ్యాధి లక్షణాలను పరిశీలిస్తే రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులో మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్లనొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటాయన్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో ఒకే ఒక్క చుక్క రక్తంను పరీక్షించడంద్వారా వ్యాధి నిర్ధారణ జరుగుతుందన్నారు. సమావేశంలో డీఎల్‌టీ డాక్టరు రమేష్, డాక్టరు ప్రభాకర్, డాక్టరు విల్సన్, డాక్టరు రవికుమార్ పాల్గొన్నారు.

216పై ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలి

తాళ్లరేవు, మే 17 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను నేషనల్ హైవే అథారిటీ ఆదేశాలమేరకు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తహసీల్దార్ పి.త్రినాదరావు శనివారం తెలిపారు. చొల్లంగి నుంచి సుంకరపాలెం వరకు 216 రహదారి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించుకోవాలి. లేకుంటే మంగళవారం నేషనల్ హైవే, పోలీసులు సహకారంతో ఆక్రమణలను మిషన్లతో తొలగించే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆక్రమణదారులంతా గమనించి హైవే అధికారులకు సహకరించాలని కోరారు.

ఇసుక డంపింగ్ ఆపండి

● మైనింగ్ శాఖ అధికారికి పట్టాదారుల వినతి

కాకినాడసిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ చీడీల పోర భూదాన యజ్ఞభూమిలో తక్షణం ఇసుక డంపింగ్ ఆపించాలని శనివారం స్థానిక పల్లంరాజు నగర్‌లోని మైనింగ్‌శాఖ అధికారికి పట్టాదారులు వినతిపత్రం సమ ర్పించారు. తమకు చెందిన పట్టా స్థలాలను ఇసుక యార్డ్‌కు లీజుకు ఇచ్చి మైనింగ్‌శాఖ అధికారులు కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘిస్తున్నారని మాజీ ఎంపీటీసీ రాయుడు అనిల్, సలాది శ్రీనివాసబాబు, సుజాతలు మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ స్థలాల్లోని ఇసుక గుట్టలు తొలగించాలన్నారు. తమ స్థలాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి సిద్ధమని హెచ్చరించారు.

పీఆర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఆంజనేయులు బాధ్యతల స్వీకరణ



కాకినాడరూరల్, మే17(ఆంధ్ర జ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్(ఎఫ్ఏసీ)గా డాక్టర్ కందుల అంజనేయులును నియమిస్తూ కళాశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఆ ఉత్తర్వులు మేరకు శనివారం ఆయన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంజనేయులు ఇదే కళాశాలలో 1996లో తత్వశాస్త్రం అధ్యాపకుడిగా చేరి 2017 వరకూ పనిచేసి రాజమహేంద్రవరం డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్లారు ఆ కళాశాల్లో 2023 వరకూ పనిచేసి తిరిగి పీఆర్ కళాశాలకు బదిలీపై వచ్చి వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అంజనేయులు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన ఈకళాశాలకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అధ్యాపకులు డాక్టర్ హరిరామప్రసాద్, డాక్టర్ జాన్‌శ్యామ్యూల్, విజయ్‌కుమార్, లక్ష్మణ్, వర్మ, నాగేశ్వరరావు, ఏవో రాజు ప్రిన్సిపాల్ అంజనేయులును అభినందించారు.

తాగి వాహనాలు నడిపితే చర్యలు

జగ్గంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సర్కిల్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12 మంది వాహనదారులను పట్టుకుని కోర్టులో హాజరుపరచగా ఏడుగురికి రూ.10వేలు వంతున రూ.70వేలు జరిమానా విధించారు. అలాగే 5 మందికి రెండు రోజులు జైలు శిక్ష విధించారు. పత్తిక్ ప్లేసెస్‌లో తాగుతున్న బుజర్గున 13 మందిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రూ.6500 ఫైన్ విధించినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక





కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఐటీడీఏ పీవో అపూర్వభరత్, పక్క చిత్రంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు తదితరులు

ఏజెన్సీలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ భారత్

మోతుగూడెం, మే 17(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా మెయిన్ రోడ్డు కూడలి వద్ద చలివేంద్రాన్ని, బీసీ వెల్ఫేర్ సంక్షేమ శాఖ తరఫున నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని పీవో భరత్ ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో మెడికల్ క్యాంప్‌ను సందర్శించి వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమైన పీవో గ్రామ సమస్యల్లో భాగంగా కమ్యూనిటీ భవన్ కావాలని పీవోను ప్రజలు అభ్యర్థించారు. మరుగుకాలువ సమస్యను మహిళలు తెలిపారు. దీనిపై పీవో స్పందించి కమ్యూనిటీ భవన్ మంజూరుచేసి, మరుగునీటి కాలువ కొత్త డ్రైన్‌ను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యాలయం పరిధిలో వృక్షాలు ఎదుగల గుంతలు ప్రారంభించి మొక్కలు నాటారు. ఉపాధి కూలీలు కూలి డబ్బులు రావట్లేదని తెలిపారు. దీనిపై పీవో స్పందించి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జీమోహన్, సర్పంచ్ ఆకెటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో అధికారు సూపరింటెండెంట్ చీఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, డాక్టర్ ఉదయ్ కుమార్‌రెడ్డి, డ్వాక్రా సంఘాలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, ఎస్‌ఎంలు ఉన్నారు.

బొడ్డగండిలో...

మోతుగూడెం, (ఆంధ్రజ్యోతి): వై. రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ పరిధి దొంకరాయి, గంగవరం గ్రామాల్లో శనివారం సచివాలయ సిబ్బంది స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. డొంకరాయి బస్‌స్టేషన్ వద్ద చలివేంద్రం ప్రారంభించి, గంగవరం ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన పశువుల నీటితొట్టిలో నీటిని నింపారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ ఎంపీటీసీ కరకా వెంకటరమణ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యనారాయణ, గుర్వయ్య, సచివాలయ సెక్రటరీలు మురళి, తిమ్మోర్తులు, సుష్మ, బేబి, విజయలక్ష్మి, ప్రవీణ్, భద్రం, ఉపాధి హామీ సిబ్బంది జెసిబో ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, కూటమి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రంపచోడవరం, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ మంగా బొజ్జయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. ఈసందర్భంగా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రధాన కూడలిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కెకొటేశ్వరరావు, డీఎల్‌పీవో కె.యు.ఆర్.ఎల్.వర్మ, ఎంపీడీవో సుందం శ్రీనివాసుదొర, డీఈఈలు వి.వెంకటరమణ, టీ.సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రంపచోడవరం సభలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్



కూనవరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అటవీశాఖ సిబ్బంది ర్యాలీ

కూనవరం, (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై శనివారం అటవీ శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కూనవరం నుంచి టేకులబోరు వరకు ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా టేకులబోరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనవరం రేంజర్ కరుణాకరన్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని పక్షుల కోసం పెడెస్టల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిఆర్‌వో అనిల్, ఎఫ్‌ఎస్‌వోలు ప్రసన్న కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో గంగాలమ్మ అమ్మవారు, పక్క చిత్రంలో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో

గంగాలమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష

మారేడుమిల్లి రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి గ్రామదేవత కనక వల్లి గంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఈనెల 20న నిర్వహించనున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనిపై మండల అభివృద్ధి అధికారి రూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆరు రోజులు జరిగే జాతర మహోత్సవానికి పంచాయతీ కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని, పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి సౌకర్యం పర్యవేక్షించాలన్నారు. ఈసందర్భంగా మారేడుమిల్లి సచివాలయ సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్లు తెలిపారు. భక్తుల సహాయం కోసం హెల్ప్‌లైన్ నెంబరు 80749 33120 అందుబాటులో ఉంటుందని వారు తెలిపారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు

మారేడుమిల్లి రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ చైర్మన్ శత్రు బొజ్జిరెడ్డిని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మట్ల దుర్గాప్రసాద్ శనివారం కలిశారు. గిరిజనాభివృద్ధికి పూర్తి మద్దతుగా మీతో నడుస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ముంపు విలీన మండలాల అధ్యక్షుడు సాయి కృష్ణ, నరేంద్రకుమార్, గంగాధర్, దేవీపట్నం అధ్యక్షుడు రాయుడు పాల్గొన్నారు.



రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు

ఉపాధి హామీ ఏపీడీ శ్రీనివాసరావుకు సత్కారం

రంపచోడవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో అధికారులు, సిబ్బంది వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేస్తే మంచి గుర్తింపు ఉంటుందని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ఉపాధి హామీ పథకంలో ఏపీడీగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న జి.శ్రీనివాసరావును శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ శ్రీనివాసరావు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ అధికారి ఎల్‌.రాంబాబు, ఉపాధి పథకం ఏపీవోలు ప్రకాష్, స్వామి, మణికుమార్, చిరంజీవి యాదవ్, వీరన్న సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

జగ్గంపేటలో టీడీపీ మినీ మహానాడు

జగ్గంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోనేవరం రోడ్డులోని కాపు సామాజిక భవనంలో జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, నియోజకవర్గ పరిశీలకులు శీలం వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నాయకులు 24 తీర్మానాలు ప్రవేశపెట్టగా వాటిలో 23 అంశాలను ఆమోదించారు. ఒక తీర్మానాన్ని వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు ప్రధాన అంశాలు సాగు, తాగునీరు, విద్యా, వైద్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గడిచిన 11నెలల్లో సిమెంట్, తారురోడ్లు, మౌలిక వసతులు కల్పించామన్నారు. టీడీపీ రాష్ట్ర, జిల్లా నేతలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు 12 మంది క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నెహ్రూకు త్వరలోనే మంత్రి పదవి వస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ఫారం పాంట్‌ల పరిశీలన



బలభద్రపురం రోడ్డులో క్వాలిటీలను పరిశీలిస్తున్న అధికారి శ్వేత, ఎంపీడీవో

జగ్గంపేట రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పారం పాంట్‌లను క్వాలిటీ కంట్రోల్ అధికారి బి.శ్వేత పరిశీలించారు. వెడల్పు, లోతులను పరిశీలించి ఎంజీఎన్ ఆర్‌జీఎస్ ఆది కాలం నుంచి వివరాలు సేకరించారు. రైతులకు వీటి ఉపయోగాలను ఏ మేరకు ఉపాధి అధికారులు తెలియ చెప్పారో అడిగి తెలుసుకున్నారు. రాబోయే వర్షాకాలంలో పారం పాంట్స్ గట్లను మొక్కలతో ఆధునీకరించాలని సూచించారు. జగ్గంపేట ఎంపీడీవో ఓ.ఓ ఏపీఎస్ చంద్రశేఖర్, జేఈ సత్యనారాయణ, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

పాలిసెట్ ఫస్ట్ ర్యాంకర్‌కు అభినందన

శంఖవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించిన బద్ది శివవెంకటేష్ విద్యార్థిని పలువురు అభినందనలు తెలిపారు. శనివారం కొంతంగి గ్రామంలోని విద్యార్థి ఇంటికి వెళ్లి మనంగా సత్కరించారు. రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు సాధించడం సామాన్య విషయం కాదని, ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. బద్ది లోవరాజు దంపతులను అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు, పర్వత సురేష్, బద్ది రమణ, వెన్నా శివ పాల్గొన్నారు.

రేపటి నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

శంఖవరం, మే 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో ఎస్వీ రమణ తెలిపారు. గత మార్చి నెలలో వెలువడిన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులు 412 మంది ఈసారి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. అన్నవరం దేవస్థానం హైస్కూల్ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1.15వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

రౌతులపూడి, మే 17(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన లింగేటి దేవుడును అరెస్టు చేసి, అతడి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. సారా తరలిస్తున్నాడనే సమాచారం మేరకు రౌతులపూడి గ్రామశివారు వాహన తనిఖీలు చేస్తుండగా పెద్దాపురం మరిడమ్మ చెట్టు వద్ద బైక్‌పై తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు.

బైక్ అదుపు తప్పి తండ్రి మృతి కొడుకుకు తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పిన ఘటనలో తండ్రి మృతి చెందగా కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలసకు చెందిన ముద్దా పెంటయ్య(72), కొడుకు అప్పలరాజు బైక్‌పై రంపచోడవరంలో పనిబట్టు కోసం శనివారం బయల్దేరారు. స్థానిక పాదాలమ్మ గుడి సమీపంలో బైక్ అదుపు తప్పి సేఫ్టీగార్డును ఢీ కొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ పెంటయ్య మృతిచెందగా అప్పలరాజు చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మినీ మహానాడుకు తరలిరండి

దేవీపట్నం, మే 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా రంపచోడవరం బాను కల్యాణ మండపంలో ఈనెల 20న నిర్వహించే మినీ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్టి వెంకటేశ్వరరావు కోరారు.

సమ్మెను జయప్రదం చేయండి

వై.రామవరం, మే 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు, ఆదివాసీ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల20న చేపట్టే గ్రామీణ భారత్ బంద్‌ను ప్రజలు విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ పిలుపునిచ్చారు. శనివారం దబ్బలిమ్మల గ్రామంలో ఉపాధి కూలీలు, కార్మిక సంఘాలతో సమావేశమయ్యారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, గిరిజన చట్టాలను పటిష్ఠ పరచాలని డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

● ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, మే17 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా తేటగుంట పీహెచ్‌ఈలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానికులతో కలిసి పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అవగాహన ర్యాలీ లో పాల్గొన్నారు. గ్రామంలో మజ్జిగ చలివేంద్రం, మెడికల్ క్యాంపును టీడీపీ నేత యనమల రాజేష్, ఎమ్మెల్యే దివ్యతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, చామంతి సత్తిబాబు, కోన కన్నారావు, కలగా శ్రీను, గెల్లం శివ, బందం బుజ్జి, ఆవాల నాని, ఖాతా గోవిందు, తమరాన రామకృష్ణ, తమరాన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



తేటగుంట గ్రామస్తులతో అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే

నిధులు ఉన్నా... నిర్లక్ష్యం ఎందుకు?

● ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం

తుని రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): తుని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులు ఉన్నా ఇంత నిర్లక్ష్యమా? చాలా కాలంగా మెటర్నిటీ వార్డులో మరుగుదొడ్ల మూతపడినా పట్టించుకోకపోవడం ఏంటీ అని కలెక్టర్ షాన్ మోహన్ ఫైర్ అయ్యారు. తుని ఏరియా ఆసుపత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ప్రసూతి చికిత్స భవనాన్ని సభ్యులు అయన సేడల్ ఆఫీసర్ ఆజయ్‌జైన్, జిల్లా ప్రత్యేకాధికారి వీర పాండ్యన్‌తో కలిసి పరిశీలించారు. భవనంలో పలు వార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. మరుగుదొడ్లను పరిశీలించి రెండు గదులు మూసి ఉండడంపై అధికారులను ప్రశ్నించారు. ఆసు పత్రి అభివృద్ధి నిధులు ఉండగా ఎందుకు మరుదొడ్లను వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. తక్షణం మరుగుదొడ్లను బాగు చేసి తెరవాలని ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గంట్ల చినబాబు తదితరులు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకార సేవ

అన్నవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మేళతాళాలతో తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాకారం చుట్టూ భక్తుల గోవిందనామ స్మరణలు, పండితుల మంత్రోచ్చారణ నడుమ మూడు మార్లు ప్రదక్షిణ చేశారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. లెక్కించనున్నట్టు ఆలయ ఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపు అనంతరం హుండీ ఆదాయం అదే రోజు జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయనున్నామని, విధులు కేటాయించిన సిబ్బంది అంతా పాల్గొనాలని కోరారు.



తిరుచ్చిపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

21న సత్యదేవుడి హుండీ లెక్కింపు

సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను ఈనెల 21న

సిందూర్ విజయంపై భారీ ర్యాలీ



ఏలేశ్వరంలో తిరంగా ర్యాలీ యాత్రలో ఎమ్మెల్యే సత్యప్రభ, కూటమి నాయకులు.

ఏలేశ్వరం, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడి యావత్ భారతావనికి గర్వకారణమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఏలేశ్వరంలో శనివారం సుమారు రెండు వేల మంది కూటమి నాయకులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి బాలాజీచౌక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మోస్ అస్త్రంతో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ వెన్నులో వణుకు పుట్టించిన త్రివిధ దళాల సైనికులకు యావత్ దేశమంతా మద్దతుగా నిలిచిందని ఎమ్మెల్యే అన్నారు. ముందుగా అమర సైనికుడు మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలాజీచౌక్ సెంటర్‌లో మాజీ భారత సైనికులు గుమ్మళ్లూరి యతీంద్ర, కెసుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, పర్వత సురేష్, బొదిరెడ్డి గోపి పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న బీజేపీ నాయకులు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి బీజేపీ నాయకుల వితరణ

వై.రామవరం, మే 17(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం యర్రంరెడ్డిపాలెంలో అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన కారం బాబూ రావు, లక్ష్మి దంపతులకు బీజేపీ నాయకులు వంట పాత్రలు, దుప్పట్లు, చీరలు, కూరగాయలు, పప్పులు అందించారు. రు. సీతారామన్నదొర (డిల్లీబాబు) ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ ఈశ్వర బుల్లికొండలదొర, పార్టీ మండల అధ్యక్షుడు కడబాల ఆదినిష్య, సారపు వీర ప్రతాప దొర తదితరులు పాల్గొన్నారు.

రామవరంలో స్వచ్ఛత వారోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జగ్గంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): రామవరంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. డ్రైనేజీలు, అంగన్‌వాడీ, ప్రైమరీ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉన్నటు చెత్తాచెదారాలను స్థానికుల సహాయ సహకారాలతో శుభ్రం చేయించారు. వారానికి ఒక ప్రాంతంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నామని వెంకటేశ్వరరావు తెలిపారు. పంచాయతీ సెక్రటరీ, ఎన్ఆర్ఈపీ, ఏపీవో, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

గండేపల్లిలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర



గండేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ శివనాగబాబు

గండేపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు సిబ్బందితో కలిసి ఇంకుడుగుంత ఏర్పాటు చేశారు. పరిసరాలు శుభ్రపరిచారు. ప్రతిజ్ఞ చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో రాజమనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మల్లేపల్లిలో ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. ఏవో చంద్రరావు, ఏపీవో రాజు, ఈసీ రమేష్, సిబ్బంది లలిత, రామస్వరూప, టీపీలు శ్రీను, మోహన్, శ్రీను, గండేపల్లి, ఉప్పలపల్లి, ఎర్రిరాజుపాలెం కార్యదర్శులు సత్యనారాయణ, పణింద్రకుమార్, వెంకటరమణానాథ్ పాల్గొన్నారు. అలాగే అదిత్య విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శ

ప్రత్తిపాడు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లిలో రెడ్డం గోవిందరావు ఆకస్మిక మృతితో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. గోవిందరావు మృతికి కారణాలను మురళీ, వాసులను అడిగి తెలుసుకున్నారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను సానుభూతి తెలిపారు. అలాగే ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైసీపీ నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు.. గోవిందరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట డొడ్డి పట్ల కృష్ణ, జువ్వల నాగేశ్వరరావు, కొరా తాతబాబు, తదితరులున్నారు. అనంతరం ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శరభవరానికి చెందిన రోడ్డు ప్రమాదక్షతులను పరామర్శించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

20 నాటికి పథకాల లక్ష్యాలు పూర్తి చేయాలి

● డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్

తొండంగి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నాటికి వివిధ పథకాల నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని డీ ఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ వెలుగు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన తొండంగి వెలుగు కార్యాలయంలో వివిధ పథకాలపై సమీక్షించారు. ప్రాజెక్టు పరిధిలో అమలుజరుగుతున్న పీఎం సూర్యఘర్, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ తదితర పథకాలపై సాధించిన ప్రగతి పై సమీక్ష జరిపి నిర్ణీత గడువులోగా లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం మహిళా పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు కల్పిస్తున్న వివిధ అవకాశాలపై వివరించారు. తీర ప్రాంత మత్స్యకార మహిళలకు ఉన్న అవకాశాలను వివరించి వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఏపీఎం పీడీ జలాని, డీపీఎం కేశవ, డీపీఎం హెచ్‌డీ అనిల్, పద్మావతి, ఎస్ విజయకుమార్, మండల సమాఖ్య సభ్యులు ఏపీఎం సత్తిబాబు పాల్గొన్నారు.